# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

నాల్గవ పాఠము

## నిర్ణాయక దృష్టికోణము: లేఖనము యొక్క భాగములు మరియు అంశములు

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్నవారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక


ఉపోద్ఘాతం ..... 1

లేఖనము యొక్క విభిన్నత ..... 2

భాష ..... 3

అసాధారణమైన ..... 3

సాధారణ ..... 5

సాహిత్యము ..... 7

అంతర్భావములు ..... 11

లేఖనములో దేవుని ధర్మశాస్త్రము ..... 12

పది ఆజ్ఞలు ..... 13

మూడు రకముల ఆజ్ఞలు ..... 16

అర్హతలు ..... 17

విలువ ..... 18

అనువర్తనము ..... 18

లేఖనము యొక్క ఐక్యత ..... 24

ప్రేమ ఆజ్ఞ ..... 25

కృపా సువార్త ..... 27

నూతన నిబంధన ..... 30

సామరస్యం ..... 32

ముగింపు ..... 34





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

నాల్గవ పాఠము

నిర్ణాయక దృష్టికోణము: లేఖనము యొక్క భాగములు మరియు అంశములు

## ఉపోద్ఘాతం

---

నా స్నేహితుడు ఒకరు ఈ మధ్యన తన కుమారుని కొరకు ఒక సైకిల్ కొన్నాడు. ఆ సైకిల్ ను విడి విడి భాగములుగా కొని దానిని బిగించవలసి వచ్చింది — చక్రాలు మరియు పెడల్స్ అమర్చుట వంటివి. అయితే సైకిల్ ను బిగించుటకు ఎలాంటి సూచనలు ఇవ్వబడలేదు. ఇప్పుడు, సైకిల్ ఏవిధంగా ఉండాలో మరియు ఎలా పని చెయ్యాలో నా స్నేహితునికి తెలుసు కాబట్టి, అతడు సూచనల సహాయం లేకుండానే దానిని బిగించగలిగాడు. అయితే అతడు ఇంతకు ముందు ఎన్నడూ సైకిల్ చూడకపోతే ఏమైయ్యేదో ఒకసారి ఊహించండి. అలా అయితే, అతడు దానిని సరిగా బిగించియుండేవాడు కాదు.

కొన్ని విధాలుగా, బైబిలు కూడా ఎలాంటి సూచనలు లేని సైకిల్ పార్టుల యొక్క డబ్బా వలె ఉన్నది. సుపరిచితమైన విషయములను సరియైన క్రమములో అమర్చుట సులువైన పనియైయున్న విధముగానే, బైబిలు అర్థము మరియు సరియైన ఉపయోగమును గూర్చి కొన్ని మౌలిక విషయములను కనుగొనుట కూడా చాలా సులువైన పని అయ్యున్నది. మరొక వైపున, సూచనలు లేకుండా సంక్లిష్టమైన పరికరములను అమర్చుట కష్టమైయున్న విధముగానే, లేఖనము యొక్క ఉత్తమమైన భాగములను అర్థము చేసుకొనకపోతే సంక్లిష్టమైన నైతిక ప్రశ్నలకు బైబిలును అనువర్తించుట కష్టమవుతుంది.

*బైబిలానుసారమైన నిర్ణయములను తీసుకొనుట* అను మన పాఠ్యక్రమములో ఇది నాల్గవ పాఠము, మరియు ఈ పాఠమునకు "నిర్ణాయక దృష్టికోణము: లేఖనము యొక్క భాగములు మరియు అంశములు" అను శీర్షికనిచ్చాము.

ఈ పాఠములన్నిటిలో మనము తెలియజేసిన విధముగానే, నైతిక వివేచనలో ఒక వ్యక్తి ఒక పరిస్థితికి దేవుని వాక్యమును అనువర్తించుట ఎల్లప్పుడూ భాగమైయుంటుంది. మరియు బైబిలు నిర్ణయములను తీసుకొనుటలో మూడు ప్రధానమైన పరిగణలను గూర్చి మాట్లాడునట్లు ఇది మనలను నడిపించింది: దేవుని వాక్యము యొక్క సరియైన ప్రామాణికత, దీనిని మనము నీతిశాస్త్రములోని నిర్ణాయక దృష్టికోణముతో అనుబంధపరచాము; సరియైన లక్ష్యము, ఇది పరిస్థితుల దృష్టికోణమునకు సంబంధించినది; మరియు సరియైన హేతువు, ఇది అస్తిత్వ దృష్టికోణమునకు అనుసంధానమైయున్నది.

ఈ పాఠములో మనము నిర్ణాయక దృష్టికోణమును మూడవసారి చూద్దాము, మరియు బైబిలులోని నైతిక ప్రామాణికతలను మనము వివేచించు ప్రక్రియను విశదీకరిద్దాము. మరియు దేవుని ప్రమాణములను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

లేఖనములోని పలు భాగములు మరియు అంశములు మనకు తెలియజేయు విభిన్నమైన విధానముల మీద దృష్టిపెడదాము.

లేఖనము యొక్క భాగములు మరియు అంశములను గూర్చిన చర్చను మనము మూడు ప్రధానమైన భాగములుగా విభాగిద్దాము: మొదటిగా, లేఖనములో మనకు కనిపించు విభిన్నమైన సాహిత్య రకములను చూద్దాము. రెండవదిగా, లేఖనములో దేవుని ధర్మశాస్త్రమును కలిగియున్న గ్రంథములు మరియు వాక్యభాగములను దగ్గరగా పరిశీలన చేద్దాము. మరియు మూడవదిగా, బైబిలులోని భాగములు మరియు అంశములన్నిటిని ఐక్యపరచు లేఖనము యొక్క ఐక్యతను గూర్చి మాట్లాడదాము. లేఖనములో మనకు కనిపించు విభిన్నతతో ఆరంభిద్దాము.

## లేఖనము యొక్క విభిన్నత

లేఖనము అంతా ఒకే విధముగా ఉండదు అని బైబిలును చదివిన ప్రతిఒక్కరు గుర్తిస్తారు. దానిలో చరిత్రలు, పద్యభాగము, జ్ఞానసాహిత్యము, ప్రవచనము, సంభాషణ, మరియు విభిన్న రకములైన ఇతర రచనలు కూడా ఉన్నాయి. మరియు ఈ రచనలన్నిటిలో, మనము మరింత విభిన్నతను చూస్తాము. ఎందుకంటే, ప్రతి రచయిత తనదైన శైలిలో వ్రాశాడు, మరియు స్వయంగా అతని రచన కూడా విభిన్నతను కలిగియుంటుంది. కొన్నిసార్లు అతడు ఆజ్ఞలను ఇచ్చాడు; కొన్నిసార్లు అతడు వివరములను వివరించాడు; కొన్నిసార్లు అతడు వ్యక్తిగత అనుభవమును జ్ఞాపకము చేసుకున్నాడు. మరియు ఈ విభిన్నత అనుకోకుండా కలిగింది కాదు. బైబిలులోని ప్రతి భాగము క్రైస్తవ నీతిశాస్త్రము యొక్క ప్రామాణికతలకు తనదైన శైలిలో తోడ్పాటునిచ్చుటకు దేవుడు దానిని నియమించాడు. ఇప్పుడు, లేఖనము అనేకమైన విభిన్నమైన రీతులలో మాట్లాడుతుంది కాబట్టి, బైబిలు చెప్పు విషయములను మాత్రమే తెలుసుకొనుట మనకు సరిపోదు. బైబిలు చెప్పు విషయములను చదువునప్పుడు, వాటిని అర్థము చేసుకొనుటకు బైబిలు మాట్లాడు విధానమును కూడా మనము తెలుసుకొనియుండాలి.

బైబిలులో మనకు కనిపించు విభిన్నతను అనేకమైన విధాలుగా మనము వర్ణించవచ్చు, మరియు ఏ ఒక్క విధానము కూడా సంగ్రహమైనది కాదు. అయితే లేఖనము యొక్క ఈ కోణము మరియు క్రైస్తవ నీతిశాస్త్రము మీద దాని యొక్క అంతర్భావములను గూర్చి అవగాహననిచ్చుటకు, మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, బైబిలులో ఉపయోగించబడిన విభిన్నమైన భాషను గూర్చి మనము మాట్లాడదాము. రెండవదిగా, బైబిలులోని విభిన్నమైన సాహిత్యమును గూర్చి మనము మాట్లాడదాము. మరియు మూడవదిగా, ఈ విభిన్నత ఆధునిక నైతిక బోధన కొరకు కలిగియున్న అంతర్భావములను

మనము చూద్దాము. భాషకు సంబంధించిన చిన్న మరియు సులువైన విషయములను చూస్తూ ఆరంభించి, సాహిత్యములోని పెద్దవైన, మరింత సంక్లిష్టమైన విషయములలోనికి వెళ్దాము.

## భాష

మొదటిగా, మనము మానవ సంభాషణలన్నిటిలో కనుగొను భాష యొక్క సంపూర్ణ శ్రేణిని బైబిలు కనుపరుస్తుంది. దానిలో కథనములు, ప్రశ్నలు, వాగ్దానములు, ప్రతిపాదనలు, శాపములు, ఆశీర్వాదములు, బెదిరింపులు, తీర్పులు, ఉల్లేఖనములు, సారాంశములు, ఆజ్ఞలు, సలహాలు, విన్నపములు, మొరలు, వర్ణనలు, నిస్సహాయ కేకలు, ఆశ మరియు మెప్పు మరియు ప్రేమ వ్యక్తీకరణములు, మొదలగునవి ఉన్నాయి. బైబిలు భాష భావనాత్మకముగా మర్మమైనది లేక భావనాత్మకముగా ఆవిష్టమైనది. దానిలో కొంత ఊహాత్మకమైనది, చిత్రాత్మకతను మరియు భాషాభాగములను ఉపయోగిస్తుంది, అయితే ఇతర భాష ఊహాత్మకత కానిది, మరియు సూటైన రీతిలో విషయములను వ్యక్తపరుస్తుంది. బైబిలులో కొంత వ్యంగ్యోక్తి మరియు నిజాయితీగల భాష కూడా ఉన్నది. అది స్పష్టమైన వ్యాఖ్యలను చేయు విధముగానే సూచనలను మరియు సూచితములను కూడా ఉపయోగిస్తుంది. అది అతిశయోక్తులను మరియు తగ్గింపు వర్ణనలను మరియు భాషావాదములను ఉపయోగిస్తుంది. మరియు అనేకసార్లు అది స్పష్టమైన విషయములను బోధించుటకు బదులుగా, కేవలం ఊహలను మాత్రమే చేస్తుంది.

ఈ అమోఘమైన భాషా భిన్నత్వము బైబిలు చదువునప్పుడు అనేక సవాళ్లను మనముందుంచుతుంది. ఏది ఏమైనా, భాషలోని ఈ విభిన్నమైన రకములను గుర్తించుట మనకు తెలియకపోతే, మరియు ప్రతి ఒక్కటి ఏ విధంగా సంభాషిస్తుందో మనకు అర్థము కాకపోతే, మనము బైబిలు బోధనలను అపార్థము చేసుకునే సంభావ్యత ఉన్నది.

ఇప్పుడు, అనేక యుగములుగా, బైబిలులో ఉన్న విభిన్నమైన భాషల వలన కలుగు సవాళ్లతో వ్యవహరించుటకు క్రైస్తవులు అనేక విధానములను ప్రతిపాదించారు. అయితే ఈ పరిష్కారములన్నీ ఈ రెండు గుంపులలో ఒకదానికి చెందినవిగా ఉన్నాయని చెప్పుట సబబే అవుతుంది: బైబిలు భాషను అసాధారణమైన రీతులలో ఉపయోగిస్తుంది అని నమ్మువారు, మరియు బైబిలు భాషను సాధారణమైన రీతులలో ఉపయోగిస్తుంది అని నమ్మువారు.

### అసాధారణమైన

చాలాసార్లు, బైబిలు అసాధారణమైన రీతులలో మాట్లాడుతుంది అని నమ్మువారు బైబిలులో ఉన్న విభిన్నమైన భాషా రకములను నిర్లక్ష్యము చేయు విధముగా పరిష్కారములను ఇస్తారు. బదులుగా,

లేఖనమంతటికి ఒకే విధముగా అనువర్తించబడు వ్యాఖ్యాన వ్యవస్థను అభివృద్ధి చేయుటకుగాను బైబిలు భాషను అతిగా సులభతరము చేస్తారు.

ఉదాహరణకు, బైబిలు దేవుని ద్వారా ప్రేరేపించబడింది కాబట్టి, మానవ గ్రహింపును మించిన విధముగా అసాధారణమైన రీతులలో అది సంభాషిస్తుంది అని మధ్య యుగములలో అనేకమంది వేదాంతవేత్తలు నమ్మారు. వారి ఆలోచన ప్రకారం, ప్రతి బైబిలు భాగములో కొన్నిసార్లు లేఖన రచయితలకు కూడా మరుగుచేయబడియున్న విభిన్నమైన చిహ్నాత్మక అర్థములు ఉన్నాయి. ఈ వ్యవస్థలో, మానవ రచయితల యొక్క ఉద్దేశ్యములతో నిమిత్తం లేకుండా ప్రతి వాక్య భాగమునకు కొంత అలంకారిక అర్థము ఉంటుంది అని ఊహించబడుతుంది.

ఈ మధ్య కాలములో, లేఖనము యొక్క భాష అసాధారణమైనది అని నమ్ము అనేకమంది క్రైస్తవులు వ్యతిరేక దిశలో ప్రయాణించారు. లేఖనము యొక్క అసాధారణమైన స్వభావము దానిని వ్యాఖ్యానించుటను కష్టతరము చేస్తుంది అని నమ్ముటకు బదులుగా, లేఖనము యొక్క అసాధారణమైన స్వభావము దాని భాషను వ్యాఖ్యానించుటను సులభతరము చేస్తుంది అని ఉద్ఘాటించారు. పరిశుద్ధాత్మ నిజమైన వ్యాఖ్యానములను ఆయన ప్రజలకు సూటిగా బయలుపరుస్తాడు, కాబట్టి ఒక వాక్యభాగము అర్థమును ఎలా తెలియజేస్తుంది అను విషయము కాదుకదా, ఒక వ్యక్తి ఎలాంటి భాషను చదువుతున్నాడు అని తెలుసుకొనుట కూడా అనవసరము అని వీరిలో కొందరు వాదించారు. లేఖనము యొక్క భాషను వీలైనంత అక్షరార్థముగా వ్యాఖ్యానించాలి, మరియు చిత్రాత్మక అర్థములు సరియైన భావనను ఇవ్వనప్పుడు మాత్రమే అలంకార అర్థములను ఉపయోగించాలి అని ఇతరులు వాదించారు.

ఉదాహరణకు, సాధారణ సంభాషణలో మానవులు సాధారణంగా అతిశయోక్తులను లేక అతిగా ఉండు కథనములను ఉపయోగిస్తారు అని మనకు తెలుసు. అయితే బైబిలు అధికారమునకు కట్టుబడియుండు అనేకమంది క్రైస్తవులు బైబిలులో అతిశయోక్తులు కనిపిస్తాయని గుర్తించరు. బదులుగా, లేఖనములో ఉన్న ప్రతి కథనము సూటిగాను, ఒకదానికొకటి సంబంధము లేకుండా, ఖచ్చితముగా ఉన్నదనట్లు వారు వ్యవహరిస్తారు.

సాధారణ ఉపన్యాసము మరియు రచనలో, మనము చాలాసార్లు విషయములను క్రోడీకరిస్తాము, మరియు మన శ్రోతలు కలిగియున్న ఇతర జ్ఞానముతో ఖాళీలను పూరించుకోవాలని ఆశిస్తాము. అయినను, ప్రేరిత రచయితలు కూడా ఇదే పని చేశారు అను విషయమును గుర్తించుటను కొందరు క్రైస్తవులు కఠినముగా భావిస్తారు. బదులుగా, లేఖనభాగములు వాటి యొక్క అభిప్రాయముల విషయములో పరిమితమైనవని తెలుసుకొనుటకు బదులుగా, వాటిని పూర్తిగా అర్థము చేసుకొనవచ్చు అన్నట్లు వ్యవహరిస్తారు.

అంతేగాక, సాధారణ రచన మరియు వ్యాఖ్యలో, మనము చాలాసార్లు వ్యంగ్యంగా వ్యవహరిస్తూ, మనము ఉద్దేశించినదానికి వ్యతిరేకముగా మాట్లాడతాము అని మనము గుర్తిస్తాము. అయినను, బైబిలులో వ్యంగ్యము ఉన్నదని ఒప్పుకొనుటను అనేకమంది క్రైస్తవులు కఠినమైన పనిగా భావిస్తారు.

లేఖన భాష అసాధారణమైనది అను ఈ అభిప్రాయములకు భిన్నముగా, మానవ సంభాషణలలోని సామాన్య పద్ధతులను ఉపయోగిస్తూ సాధారణ మానవ భాషను ఉపయోగిస్తూ బైబిలు మాట్లాడుతుంది అనే అభిప్రాయమైయున్నది.

## సాధారణ

మునుపటి పాఠములో, మనము లేఖనము యొక్క స్పష్టతను గూర్చి మాట్లాడుతూ, బైబిలు అస్పష్టముగా లేదు అని, మర్మాత్మకమైన మార్గములు లేక విశేషమైన ఆత్మీయ వరములు, లేక సంఘములో విశేషమైన స్థానములు కలిగియున్నవారి ద్వారా కనుగొనబడు మర్మాత్మక అర్థములు దానిలో లేవని చెప్పిన విషయము మీకు జ్ఞాపకముండే ఉంటుంది. మరొక మాటలో, లేఖనము సాధారణమైన భాషతో మాట్లాడుతూ, సామాన్యమైన మార్గములలో సంభాషిస్తేనే స్పష్టమైయుంటుంది.

బైబిలు సాధారణమైన మానవ భాషను ఉపయోగిస్తూ మాట్లాడుతుంది అని కనుపరచుటకు, అతిగా అక్షరార్థముగా చదువుట ఘోరముగా తప్పుదారి పట్టిస్తుంది అని చూపు కొన్ని వాక్యభాగములను చూద్దాము. ప్రభువు ప్రార్థనలో భాగమైయున్న, మత్తయి 6:11లోని ఈ విన్నపమును గూర్చి ఆలోచన చెయ్యండి.

> మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము (మత్తయి 6:11).

సాధారణ మానవ వ్యక్తీకరణలతో సంబంధము లేకుండా ఈ వచనమును కృత్రిమమైన అక్షరార్థ విధానములో చదివినప్పుడు, తనకు రొట్టెను ఇవ్వమని యేసు దేవుని ఆజ్ఞాపించినట్లు అనిపిస్తుంది.

వాస్తవానికి, "మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము" అను మాటతో పాటుగా, "దుష్టుని నుండి మమ్మును తప్పించుము" వంటి ప్రభువు ప్రార్థనలోని విన్నపములన్నీ ఆదేశముల రూపమును కలిగియున్నాయి. మరియు గ్రీకు వ్యాకరణములో ఆదేశములు చాలాసార్లు ఆజ్ఞలైయున్నవను మాట వాస్తవమే.

బైబిలును అతి అక్షరార్థముగా చదువు క్రైస్తవులు యేసు మాటలు దేవుని ఆజ్ఞాపించుచున్నవి అని చెప్పునట్లు ఈ వాస్తవము దారితీసింది. మరియు అవును, ప్రభువు ప్రార్థన మన వ్యక్తిగత ప్రార్థనలలో అనుసరించవలసిన మాదిరి అయ్యున్నది కాబట్టి, దేవుని ఆజ్ఞాపించు హక్కు మనకు ఉన్నది అని వారు నిర్ధారించారు.

అయితే, ఆదేశ క్రియాపదములు విన్నపములను మరియు విజ్ఞాపనలను చేయుటకు కూడా ఉపయోగించబడినవి అని ప్రభువు ప్రార్థనలో యేసు స్వయంగా పలికిన మాటలతో సహా మిగిలిన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

లేఖనభాగములలో మనము చూస్తాము. ఆంగ్లములో కూడా ఇదే వాస్తవమైయున్నది. ఉదాహరణకు, “దయచేసి, ఆ రొట్టె ఇటు ఇవ్వండి.” లేక “దయచేసి నాకు సహాయము చెయ్యండి!” అని మనం అంటాము. ఈ కథనములు ఆదేశములైయున్నవి. అయితే మనము ఈ మాటలను పలుకునప్పుడు, సాధారణంగా మనము ఆజ్ఞలను ఇచ్చుటలేదు. ఆమోసు 4:4ను కూడా పరిగణించండి, అక్కడ ప్రవక్త ఇలా సెలవిచ్చాడు:

> బేతేలునకు వచ్చి తిరుగుబాటు చేయుడి, గిల్గాలునకు పోయి మరి యెక్కువగా తిరుగుబాటు చేయుడి (ఆమోసు 4:4).

ఈ మాటలను అతి అక్షరార్థముగా చదువుట వలన, బేతేలు మరియు గిల్గాలులో ఉన్న విగ్రహారాధనా ఆలయములకు వెళ్లి యెహోవాకు విరోధముగా పాపము చేయమని ఆమోసు తన శ్రోతలను కోరాడు అనునట్లు కొందరు వ్యాఖ్యాతలు ఆలోచించుటకు దారితీసింది. అయితే ఇట్టి అర్థము అస్వాభావికమైనది మరియు ఇతర కథనములలో బయలుపరచబడిన ప్రవక్త యొక్క ఉద్దేశములతో అనుగుణంగా లేదు. ఉదాహరణకు, ఆమోసు 5:5లో ప్రవక్త ఇలా సెలవిచ్చాడు:

> బేతేలును ఆశ్రయింపకుడి, గిల్గాలులో ప్రవేశింపకుడి (ఆమోసు 5:5).

బేతేలు మరియు గిల్గాలులో పాపము చేయమని ప్రవక్త ప్రజలకు ఆదేశించినప్పుడు, అతడు వ్యంగ్యముగా, అనగా తాను ఉద్దేశించినదానికి వ్యతిరేకముగా మాట్లాడాడు అని ఈ వచనములో నుండి మరియు ఆమోసు గ్రంథములోని మిగిలిన భాగము నుండి మనము నిర్ధారించవచ్చు. ఈ స్థలములలో వారు పాపము చేయాలని అతడు కోరలేదుగాని, వారు పాపము చేయుట మానాలని అతడు కోరాడు.

బైబిలు భాషలోని లక్షణములు కేవలం లేఖనమునకు మాత్రమే విశేషమైనవి కావు. బదులుగా, బైబిలు దాని రచయితలు మరియు వారి వాస్తవిక శ్రోతల యొక్క భాషాపరమైన పద్ధతులను ఉపయోగిస్తుంది. అనగా, బైబిలును మనము బాధ్యతాయుతముగా వ్యాఖ్యానించాలంటే, వారు సాధారణంగా భాషను ఏ విధముగా ఉపయోగించారో మనము నేర్చుకోవాలి, మరియు ప్రతి రచయిత తాను వ్రాసినప్పుడు కలిగియుండిన ఉద్దేశమును మనము అర్థము చేసుకోవాలి. తన మాటలు అలంకార రూపములో అర్థము చేసుకోబడాలని రచయిత వాటిని రూపొందిస్తే, వాటిని మనము అలంకార రూపములో చదువుతూ, రచయిత ఉద్దేశించిన అర్థము కొరకు వాక్యభాగమును అన్వేషించాలి. మరొక వైపున, బైబిలు రచయిత తన మాటలను సూటిగా మరియు స్పష్టముగా రూపొందిస్తే, అతని మాటలను చిత్రాత్మకత లేకుండా వ్యాఖ్యానించుట మన బాధ్యత అయ్యున్నది.

## సాహిత్యము

లేఖనములో అనేక రకముల భాష ఉన్న విధముగానే, అనేక రకముల సాహిత్యములు కూడా ఉన్నాయి. ఇవి భాష కంటే విశాలమైనవి, మరింత సంక్లిష్టమైనవి, మరియు వాటి మీద పట్టును సాధించుట మరింత కష్టమైన పని అయ్యున్నది. లేఖనములో ఉన్న పలు భాగములను మరియు అంశములను బాధ్యతాయుతముగా ఉపయోగించుటకు వాటిని అర్థము చేసుకొనుట కీలకమైయున్నది.

లేఖనములో అనేక రకముల లేక శైలుల సాహిత్యము ఉన్నది. ఉదాహరణకు, బైబిలు సాహిత్యములో ఈ క్రింది శైలులు ఉన్నాయి: గద్యభాగము, పద్యభాగము, పాటలు, ధర్మశాస్త్రము, కథనము, లేఖ, ఒడంబడిక, పత్రిక, ప్రవచన దేవోక్తి, సామెత, ఉపమానము, మరియు నాటిక. మరియు చాలాసార్లు ఈ విశాలమైన రూపములలో, అనేక చిన్న విభాగములు కూడా ఉంటాయి. ఉదాహరణకు, ప్రవచన దేవోక్తి అను సాహిత్య రకములో, తీర్పు దేవోక్తులను, ఆశీర్వాద దేవోక్తులను, న్యాయవ్యాజ్యములకు సంబంధించిన దేవోక్తులను, మొదలగువాటిని మనము చూస్తాము. ఈ రకములు వాటి విషయములతో సహా, వాటి నిర్మాణము, శైలి, మరియు భాషా ఉపయోగము ద్వారా వ్యత్యాసమైయున్నవి. అంతేగాక, ప్రతి బైబిలు శైలి అర్థమును పలు రీతులలో తెలియజేస్తుంది. కాబట్టి, బైబిలులో ఉన్న భాష యొక్క సంక్లిష్టతలను గూర్చి మనము అవగాహన కలిగియుండవలసిన విధముగానే, పలు సాహిత్య రకముల సంక్లిష్టతలను గూర్చి కూడా మనము అవగాహన కలిగియుండాలి.

సాధారణంగా మనము నీతిశాస్త్రమును అధ్యయనం చేయునప్పుడు, బైబిలులో నియమములను కలిగియున్న లేక నైతిక ప్రామాణికతలను మరియు బాధ్యతలను సూటిగా బోధించు వాక్యభాగముల మీద దృష్టిపెడతాము. మరియు మన నీతిశాస్త్ర అధ్యయనమునకు ఈ వాక్యభాగములు నిశ్చయముగా ప్రాముఖ్యమైయున్నవి. అయితే నైతిక ఉపదేశముల విషయములో ఇతర శైలులు ఎలాంటి విషయములను తెలియజేయవు అని ఆలోచించు పొరపాటును మనము చేయకూడదు. మన ఉద్దేశ్యముల కొరకు, బైబిలు కథనములు నైతిక నియమములను మరియు నియంత్రణలను కూడా తెలియజేస్తాయని మనము గుర్తించాలి. పద్యభాగము మరియు పాటలు నైతిక విషయములను వ్యక్తపరుస్తాయి. సామెతలు మరియు ఇతర జ్ఞాన సాహిత్య రచనలు నైతిక విలువలను ప్రతిబింబిస్తాయి. ప్రవచనము మానవ క్రియల పట్ల సంతోషించు లేక అసంతృప్తి రూపములో దేవుని నైతిక తీర్పులను వ్యక్తపరుస్తుంది.

వాస్తవానికి, మునుపటి పాఠములలో మనము చూసినట్లు, బైబిలులోని ప్రతి వాక్యభాగము దేవుని గుణమును వ్యక్తపరుస్తుంది, కాబట్టి ప్రతి వాక్యభాగములో నైతిక బోధన ఉన్నది, ఆ వాక్యభాగము న్యాయపరమైన నియమము కావచ్చు, లేక ఒక పత్రిక, లేక పద్యము, లేక సామెతల సంగ్రహము, లేక చారిత్రిక కథనము, లేక ఇతర సాహిత్య రకము కావచ్చు. ఈ కారణం చేత, మనము నీతిశాస్త్రమును

అధ్యయనం చేయునప్పుడు, దేవుని నైతిక ప్రామాణికతలను బయలుపరచు బైబిలు సాహిత్యముల రకములన్నిటిని మనము వెదకాలి.

లేఖనములో కనిపించు శైలులన్నీ మన నైతిక ధ్యానములన్నిటిని నడిపించాలని ఉదహరించుటకు, బైబిలు కథనములను మనము పరిగణిద్దాము. నిశ్చయముగా బైబిలు రచయితలు చారిత్రిక వాస్తవములను నమోదు చేయుట మీద ఎక్కువ ఆసక్తిని చూపారు. అయితే విశ్వాసమును బయలరచుట మరియు నైతిక పాఠములను బోధించుట పట్ల కూడా వారు ఆసక్తిని చూపారు. మన క్రైస్తవ నీతిశాస్త్ర అధ్యయనమునకు మరియు ఆచరణకు చారిత్రిక కథనములు తోడ్పడిన ఐదు విశేషమైన మార్గములను మనము ప్రస్తావిద్దాము.

మొదటిగా, మౌలిక స్థాయిలో, బైబిలు కథనములు వాటి యొక్క వాస్తవిక విషయములను అంగీకరించుటకు మనలను బద్ధులనుగా చేస్తుంది. విమోచన చరిత్రలోని విషయములు వాస్తవములైయున్నవి అని నమ్మునట్లు మనము నైతిక బాధ్యత కలిగియున్నాము. సువార్తలోని కేంద్ర సన్నివేశములైన, యేసు మరణము, సమాధి, పునరుత్థానము, మరియు ఆరోహణము, మరియు పెంతెకొస్తు దినమందు తన పరిశుద్ధాత్మను పంపుట వంటివాటి విషయములో ఇది విశేషముగా వాస్తవమైయున్నది. అయితే చారిత్రిక కథనముల ద్వారా లేఖనము మనకు బోధించిన ప్రతి ఇతర వాస్తవము విషయములో కూడా ఇదే వాస్తవమైయున్నది. బైబిలు కథనములలో ఈ వాస్తవములను తెలియపరచుట మాత్రమే, మనలను వాటిని నమ్మ బద్ధులను చేస్తుంది.

బైబిలు కథనములు క్రైస్తవ నీతిశాస్త్రమునకు ప్రాముఖ్యమైయున్నవి అనుటకు రెండవ కారణము, బైబిలు చరిత్రకు మనలను నైతికముగా మార్చగల శక్తి ఉన్నది అను విషయమైయున్నది. అనగా, బైబిలు చరిత్రలోని విషయములను తెలుసుకొనుట క్రైస్తవుడగుటలో భాగమైయున్నది.

మన మొదటి పాఠములో మనము చూసినట్లు, కేవలం మంచి ప్రజలు మాత్రమే మంచి పనులను చేయు సామర్థ్యత కలిగినవారైయున్నారు. మరియు సువార్త పట్ల నిజమైన రక్షించు విశ్వాసము కలిగియున్నవారు మాత్రమే మంచివారైయున్నారు. అవును, మనము క్రీస్తునందు రక్షింపబడు విశ్వాసము కలిగియుండుటకు, క్రీస్తు ఎవరో మరియు ఆయన ఏమి చేశాడో మనము ఎరిగియుండాలి. మరియు ఈ వాస్తవములను మనము బైబిలు చారిత్రిక నివేదికలో నుండి నేర్చుకుంటాము. కాబట్టి, క్రీస్తునందు రక్షింపబడు విశ్వాసము కలిగియుండుటకు కొంత బైబిలు చరిత్రను తెలుసుకొనుట అవసరమైయున్నది. కాబట్టి, మనము నైతికముగా ప్రవర్తించాలంటే కొంత బైబిలు చరిత్రను తెలుసుకొనియుండుట అవసరమని చెప్పుట సబబే అవుతుంది.

మూడవదిగా, బైబిలు కథనములు దేవుని నియమముల కొరకు చారిత్రిక నేపథ్యమును అందిస్తాయి. దేవుని ధర్మశాస్త్రమును సరియైన రీతిలో అర్థము చేసుకొనుటకు, ధర్మశాస్త్రము ఇవ్వబడిన చారిత్రిక నేపథ్యమును మనము అర్థము చేసుకోవాలి. ఉదాహరణకు, ధర్మశాస్త్రమునకు విధేయత చూపునట్లు

మనలను పురికొల్పుటకు బైబిలు కథనములు దేవుని కృపను ఉద్ఘాటిస్తాయని మనము చూడవలసియున్నది. పది ఆజ్ఞలు కూడా ఈ విధంగానే ఆరంభమవుతాయి. నిర్గమ. 20:2లో మనము చదువునట్లు, దేవుడు ఇలా చెబుతూ ఆరంభించాడు:

> నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని (నిర్గమ. 20:2).

ఈ క్లుప్త చారిత్రిక కథనము పది ఆజ్ఞలను పరిచయం చేసి, విధేయత చూపుటకు కీలకమైన ప్రోత్సాహమును అందించింది. వాస్తవానికి, కృతజ్ఞత భావము లేకుండా వాటిని పాటించుటకు ప్రయత్నించుట ఆజ్ఞల పట్ల నిజమైన విధేయత వైపుకు మనలను ఏనాడు నడిపించలేదు. ఎందుకంటే, మనము మునుపటి పాఠములో చూసినట్లు, సత్క్రియలు అన్నీ మంచి పురికొల్పులను కలిగియుండాలి.

కాబట్టి, నీతిశాస్త్రము కొరకు బైబిలు కథనములు ప్రాముఖ్యమైయున్నవి ఎందుకంటే, బైబిలు చరిత్రను సరిగా అర్థము చేసుకున్నప్పుడు మాత్రమే మనము దేవుని నియమములను సరిగా అర్థము చేసుకోగలము.

నాల్గవదిగా, బైబిలు కథనములు చారిత్రిక సన్నివేశములకు దేవుని మూల్యాంకనమును అందిస్తాయి. మరియు దేవుని మూల్యాంకనాలు ఎల్లప్పుడూ సరియైనవే కాబట్టి, అవి మనకు స్థిరమైన నైతిక మార్గదర్శకమును అనుగ్రహిస్తాయి.

మనము “మంచి”ని దేవుడు దీవించునదిగా, మరియు “చెడును” ఆయన శపించునది లేక శిక్షించునదిగా నిర్వచించిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది. సరే, బైబిలు కథనములలో, రచయితలు దేవుడు ఆశీర్వదించిన మరియు శపించిన క్రియలు, ఆలోచనలను మరియు పురికొల్పుల రకములను ఉదాహరిస్తారు. ఇలా చేయుట ద్వారా, వారు తమ పాఠకులకు అనుసరించుటకు మరియు తిరస్కరించుటకు ఉదాహరణలను అందించారు.

చివరిగా, కొన్నిసార్లు బైబిలు చరిత్ర యొక్క రచయితలు తమ సొంత నైతిక వ్యాఖ్యలను నమోదు చేశారు. కొన్నిసార్లు ఈ వ్యాఖ్యలు, సున్నితముగా ఉన్నాయి, మరికొన్నిసార్లు కఠోరముగా ఉన్నాయి. ఉదాహరణకు, ఆది. 13:12-13లో, సొదొమ ప్రజలను గూర్చి మోషే ఈ వ్యాఖ్యను చేశాడు:

> అబ్రాము కనానులో నివసించెను. లోతు ఆ మైదానమందున్న పట్టణముల ప్రదేశములలో కాపురముండి సొదొమదగ్గర తన గుడారము వేసికొనెను. సొదొమ మనుష్యులు దుష్టులును, యెహోవా దృష్టికి బహు పాపులునై యుండిరి (ఆది. 13:12-13).

మోషే చేసిన సొదొమ యొక్క నైతిక మూల్యాంకనము లోతు యొక్క జ్ఞానమును ప్రశ్నించుట మాత్రమేకాదుగాని, పట్టణము మీదికి దేవుడు తీసుకొని రాబోవుచుండిన న్యాయము కొరకు కూడా ఎదురుచూసింది.

దేవుని ద్వారా ప్రేరేపించబడిన ప్రతినిధిలుగా, బైబిలులోని చారిత్రిక నివేదికల యొక్క రచయితలు తమ వృత్తాంతములలో ఉన్న అనేక పాత్రలు, పైఖరులు, మరియు సన్నివేశముల యొక్క మంచితనము లేక దుష్టత్వమును గూర్చి వ్యాఖ్యానించారు. వారి మూల్యాంకనాలు స్వయంగా దేవుని యొక్క దృక్కోణములకు ప్రాతినిధ్యము వహిస్తాయి మరియు మనకు నైతిక పరిగణలను అందిస్తాయి.

కాబట్టి, లేఖనమంతటినీ మన నైతిక ప్రామాణికతగా ఉపయోగించుట వలన కలుగు అంతర్భావములు ఏమిటి? మొదటిగా, చారిత్రిక కథనములను గూర్చి మనము చూసినవి ఇతర బైబిలు సాహిత్య రకములకు కూడా వర్తిస్తాయి: ప్రతి సాహిత్య రకము నిర్ణాయకమైయున్నది; ప్రతి రకమైన సాహిత్యము మనము ఆలోచించవలసిన, క్రియలు చేయవలసిన, మరియు భావించవలసిన విధానమును గూర్చి మనకు ఎంతో కొంత నేర్పిస్తుంది. ఫలితంగా, బైబిలులోని ప్రతి వాక్యభాగము మన మీద నైతిక బాధ్యతలను ఉంచుతుంది.

ఉదాహరణకు, బైబిలు పద్యభాగము చాలాసార్లు సరియైన భావనాత్మక వ్యక్తీకరణ మీద దృష్టిపెడుతుంది, మరియు తరచుగా అది దేవుని ఆమోదమును మరియు నిరాకరణను వర్ణిస్తుంది. ప్రవచనము మానవ ప్రవర్తన పట్ల దేవుని సంతృప్తి లేక కోపమును కనుపరుస్తుంది. అలానే, దేవుని కటాక్షమును పొందుకొనుటకు చేయవలసిన సత్క్రియలను బయలుపరచి, ఆయన కోపమునకు కారణమగు పాపపు క్రియలను గూర్చి హెచ్చరిస్తుంది. జ్ఞాన సాహిత్యము మన కొరకు ఉన్నతమైన నైతిక ప్రమాణమైన దేవుని గుణమును వివరిస్తుంది, మరియు ధర్మశాస్త్ర నియమములను ఆచరణాత్మక క్రైస్తవ జీవనమునకు అనువర్తించు విధానమును గూర్చి బోధిస్తుంది. ఒక వాక్యభాగములో నైతిక పరిగణలు ఉద్ఘాటించకపోయినప్పటికీ, వాటిని మనము ఎల్లప్పుడూ ఊహించవచ్చు.

2 తిమోతి 3:16-17లో పౌలు మాటలను మరొకసారి చూడండి:

> దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమోతి 3:16-17).

సాహిత్య శైలితో నిమిత్తం లేకుండా, ప్రతిలేఖనము దేవుని సంతోషపరచుటకు క్రైస్తవులను సిద్ధపరుస్తుంది అని పౌలు ఉద్ఘాటించాడు. అంతేగాక, లేఖనములోని ప్రతి వాక్యభాగము నీతిశాస్త్రమునకు ఔచిత్యముగా ఉన్నది కాబట్టి, బైబిలు రచయిత స్వయంగా నైతిక కోణమును ఉద్ఘాటించనప్పటికీ, ప్రతి

వాక్యభాగము యొక్క నైతిక కోణముల మీద దృష్టిపెట్టుట సరియైన పనే అవుతుంది. క్లుప్తంగా, లేఖనములోని ఏ భాగము యొక్క నైతిక అంతర్భావములను మనము నిర్లక్ష్యము చేసినా, దేవుని ప్రత్యక్షతలో అనుగ్రహించబడిన నైతిక మార్గదర్శకముల యొక్క సంపూర్ణ పరిమితి నుండి మనలను మనము దూరము చేసుకుంటాము.

## అంతర్భావములు

ఇప్పుడు, నీతిశాస్త్రమును గూర్చి మనకు బోధించుటకు లేఖనము అనేక రకముల భాషను మరియు సాహిత్యమును ఉపయోగిస్తుంది అను వాస్తవము నేడు మనము నీతిశాస్త్రమును బోధించు విధానము కొరకు కొన్ని ఆసక్తికరమైన అంతర్భావములను కలిగియున్నది. ఒక విషయం ఏమిటంటే, విభిన్నమైన శైలులను ఉపయోగించుట ద్వారా మన సొంత నీతిశాస్త్ర బోధన లాభమును పొందుతుంది అని లేఖనముయొక్క విభిన్నత తెలియజేస్తుంది.

సూటైన నైతిక ఉపదేశము అనేక విషయములను అర్థము చేసుకొనుటలో మనకు సహాయము చేస్తుంది అను మాట వాస్తవమే. అయితే సూటైన ఉపదేశము మీద మనము పూర్తిగా ఆధారపడినప్పుడు మనము కొంత కోల్పోతాము కూడా. పద్యభాగము మరియు కథనముల వలె సాధారణ వ్యాఖ్యలు మన భావనలను అదే విధముగా తాకవు, అంతేగాక లేఖనములో సాధారణమైన నైతిక ఉపదేశములు కీర్తనలు లేక యేసును గూర్చిన వృత్తాంతముల వలె మనలను చాలా అరుదుగా కదుల్చుతాయి. సంక్లిష్టమైన నైతిక బోధనలలో విశదీకరించబడిన పరిస్థితులు కథనములలో ఉన్నవాటి అంత సూక్ష్మముగా చాలా అరుదుగా ఉంటాయి. మరియు సామెతలు మనలను తాకు విధముగా సాధారణ వ్యాఖ్యలు నైతిక విషయములను ఆలోచించునట్లు మనలను పురికొల్పవు.

కాబట్టి, కొన్నిసార్లు లేఖనము స్వయంగా ఉపయోగించిన విధముగా భాష యొక్క పలు రూపములను ఉపయోగిస్తూ నీతిశాస్త్రమును బోధించుట మరియు ప్రకటించుట సహాయకరముగా ఉంటుంది. కొన్ని నేపథ్యములలో, నైతికమైన నిర్ణయములను తీసుకొనుటను గూర్చి మనము చేయు బోధనలు సాధారణముగా నీతిశాస్త్రముతో అనుబంధము కలిగిలేని మన సొంత పద్య చిత్రాత్మకతను, కథలను, సామెతలను, ఉపమానములను, మరియు ఇతర శైలులను ఉపయోగించుట ద్వారా మరింత ప్రభావవంతమవుతాయి.

కాబట్టి, మనము విశేషముగా క్రైస్తవ నీతిశాస్త్రమును గూర్చి ఆలోచన చేయుచుండగా, లేఖనములో ఉన్న భాష మరియు సాహిత్య రకములు అన్నీ నిర్ణాయకమైనవి అని మనము జ్ఞాపకముంచుకోవాలి. మరియు ప్రతి రకమైన భాష మరియు సాహిత్యము నైతిక ఉపదేశమును తెలియపరచు పలు మార్గముల

మీద మనము విశేషమైన దృష్టిని పెట్టాలి. ప్రతి రకముతో జాగ్రత్తగా వ్యవహరించుట ద్వారా మాత్రమే మనము నైతిక బోధలను సరియైన రీతిలో అర్థము చేసుకోగలుగుతాము.

బైబిలులో ఉన్న పలు రకముల భాష మరియు సాహిత్యము నైతిక ప్రామాణికతగా లేఖనమును ఉపయోగించుచుండగా మనకు మార్గనిర్దేశనము చేయునదిగా ఉన్న విధానమును మనము పరిచయం చేశాము కాబట్టి, ఇప్పుడు లేఖనములో దేవుని ధర్మశాస్త్రము వైపుకు, నీతిశాస్త్రమును గూర్చి స్పష్టముగా మాట్లాడు బైబిలు భాగముల వైపుకు మన దృష్టిని మళ్లించవలసియున్నది.

## లేఖనములో దేవుని ధర్మశాస్త్రము

క్రైస్తవ మరియు యూదుల సంప్రదాయములలో, మోషే వ్రాసిన ఐదు గ్రంథములు — అనగా ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశకాండములు — "ధర్మశాస్త్రము" అని పిలువబడతాయి. అయితే ఈ పాఠములలో మనము దేవుని ధర్మశాస్త్రమును గూర్చి మాట్లాడునప్పుడు, మనము ప్రధానముగా మోషే వ్రాసిన గ్రంథములను సంబోధించుటలేదుగాని, న్యాయ నియమావళి సాహిత్య రూపములో ఉన్న లేఖన భాగములను సంబోధించుచున్నాము. ఈ భాగములు ప్రధానముగా నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశకాండములలో కనిపిస్తాయి. అయితే ఈ గ్రంథములలో వాటి యొక్క న్యాయ నియమావళిలో భాగముగా లేని చారిత్రిక కథనము, పద్యభాగము, పట్టికలు మరియు ఇతర భాగములు కూడా ఉంటాయి. అంతేగాక, న్యాయ నియమావళిలోని కొన్ని భాగములు మోషే గ్రంథముల వెలుపల కూడా కనిపిస్తాయి.

ఇప్పుడు, మనము ఇంతకు ముందు చెప్పినట్లు, దేవుని ధర్మశాస్త్రము నిర్ణాయక నైతిక హెచ్చరికను కలిగియున్న ఏకైక లేఖన భాగము కాదు. లేఖనమంతా నిర్ణాయకమైనదిగా ఉన్నది. అయితే ధర్మశాస్త్రములో దేవుని నైతిక అర్హతలను గూర్చిన అత్యంత స్పష్టమైన మరియు అత్యంత వైశిద్యమైన వ్యక్తీకరణములు ఉన్నాయి, మరియు సాంప్రదాయికముగా నైతిక పరిశోధన కొరకు ఆరంభ బిందువుగా పనిచేశాయి.

దేవుని ధర్మశాస్త్రమును గూర్చిన మన చర్చ రెండు భాగములుగా విభావించబడుతుంది. మొదటిగా, మనము దేవుని ధర్మశాస్త్రములో మూల ఆజ్ఞలైన పది ఆజ్ఞల యొక్క ప్రాముఖ్యతను వివరించుదాము. మరియు రెండవదిగా, వేదాంతవేత్తలు సాంప్రదాయికముగా గుర్తించిన దేవుని ధర్మశాస్త్రములోని మూడు విభిన్నమైన రకములను మనము పరిచయం చేద్దాము. పది ఆజ్ఞల వైపుకు మన దృష్టిని తిప్పుతూ ఆరంభిద్దాము.

## పది ఆజ్ఞలు

పది ఆజ్ఞలు నిర్గమకాండము 20 మరియు ద్వితీయోపదేశకాండము 5లో ఇవ్వబడినవి. పలు వేదాంతశాస్త్ర సంప్రదాయములు ఆజ్ఞలను పలు విధములుగా వివరిస్తాయి, కాని ఈ పాఠములలో, మనము సాంప్రదాయిక ప్రొటెస్టెంట్ క్రమమును అనుసరిద్దాము. పది ఆజ్ఞలను ఈ క్రింది విధముగా క్రోడీకరించవచ్చు:

> ఆజ్ఞ 1: నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.
>
> ఆజ్ఞ 2: దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు.
>
> ఆజ్ఞ 3: నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు.
>
> ఆజ్ఞ 4: విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము.
>
> ఆజ్ఞ 5: నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.
>
> ఆజ్ఞ 6: నరహత్య చేయకూడదు.
>
> ఆజ్ఞ 7: వ్యభిచరింపకూడదు.
>
> ఆజ్ఞ 8: దొంగిలకూడదు.
>
> ఆజ్ఞ 9: నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు.
>
> ఆజ్ఞ 10: నీ పొరుగువానిదానిని ఆశించకూడదు.

కొందరు వేదాంతవేత్తలు పది ఆజ్ఞలను మోషే ధర్మశాస్త్రములోని ఇతర భాగముల వలెనే చూచునప్పటికీ, లేఖనము యొక్క ఇతర ఆజ్ఞల కంటే పది ఆజ్ఞలకు విశేషమైన ప్రాధాన్యత ఉన్నదని బైబిలు సూచిస్తుంది.

పది ఆజ్ఞల యొక్క ప్రాధాన్యత చారిత్రికమైనది మరియు వేదాంతపరమైనదిగా కూడా ఉన్నది. చారిత్రిక ప్రాధాన్యత, మనకు తెలిసినంత వరకు, ఈ నియమములు ఇశ్రాయేలు దేశము పొందుకొనిన మొట్టమొదటి వ్రాయబడిన న్యాయ నియమావళి అను వాస్తవము మీద ఆధారపడి ఉంటుంది. గలతీ. 3:17లో ఈ మాటలను వ్రాస్తూ పౌలు ఈ వాస్తవము మీద విశేషమైన ఆసక్తిని కనుపరచాడు:

> నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు (గలతీ. 3:17).

పది ఆజ్ఞలను ఇచ్చుటను పౌలు ధర్మశాస్త్రము యొక్క "పరిచయం"గా సంబోధించుచున్నాడు, మరియు ఈ రూపములో మొదటిసారిగా ఇశ్రాయేలువారు దేవుని ధర్మశాస్త్రమును ఇక్కడ పొందుకున్నారు అని సూచిస్తున్నాడు. ఇశ్రాయేలు పది ఆజ్ఞలను మోషే ద్వారా పొందుకున్నది, మరియు మోషే పది ఆజ్ఞలను

సీనాయి పర్వతము మీద స్వయంగా దేవుని యొద్ద నుండి పొందుకున్నాడు. పది ఆజ్ఞలను పొందుకొనుట ద్వారా, ఇశ్రాయేలు దేవుని పరిశుద్ధమైన అవసరతల నియమావళిని విశేషముగా, అసాధరణమైన రీతిలో బయలుపరచబడిన విధముగా కలిగియున్న మొట్టమొదటి దేశమైయ్యింది.

అవును, మోషే కాలమునకు ముందు దేవుని ప్రజలు అనేక ఇతర ఆజ్ఞలను కూడా కలిగియుండిరి. ప్రజలు పాటించాలని ఆయన ఆశించిన అనేక ప్రామాణికతలను దేవుడు కలిగియుండినాడు అని నోవహు దినములలో కలిగిన జలప్రళయములో మనము స్పష్టముగా చూడవచ్చు. మరియు ప్రజలు దేవునికి విధేయత చూపుటలో విఫలమైనప్పుడు, ఆయన సర్వ సృష్టిని జలప్రళయముతో నాశనం చేశాడు. అంతేగాక, అబ్రాహాము కూడా విధేయత చూపవలసిన నియమములు మరియు షరతులు లేకుండా లేడు. ఆది. 17:1లో, దేవుడు అతనికి ఒక విశాలమైన మరియు ఉద్ఘాటనతో కూడిన ఉపదేశమును ఇచ్చాడు.

> నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము (ఆది. 17:1).

ఇప్పుడు, ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతము యొద్ద బస చేసినప్పుడు వారికి పది ఆజ్ఞలు మాత్రమే ఇవ్వబడలేదు. అయితే వారు సీనాయి పర్వతము యొద్ద బసచేయుచుండగనే ఇశ్రాయేలు తరువాత పొందుకొనిన అనేక నియమములకు ఇవి ప్రాథమిక సారాంశ కథనముగా పని చేశాయి. నిబంధన గ్రంథము అని పిలువబడు ఈ ఇతర నియమములు నిర్గమ. 21-23 అధ్యాయములలో ఉన్నాయి. పది ఆజ్ఞలతో పాటుగా, నిబంధన గ్రంథము ఇశ్రాయేలు యొక్క ఆరంభ వ్రాయబడిన న్యాయ నియమావళిని రూపొందించింది. తరువాత, ఈ నియమావళి అనేక ఇతర నియమములను చేర్చుట ద్వారా వ్యాప్తిపరచబడింది.

తాత్కాలిక ప్రాధాన్యతతో పాటుగా, పది ఆజ్ఞలకు వేదాంత లేక సిద్ధాంత ప్రాధాన్యత కూడా ఉన్నది. నిర్గమ. 24:12లో మనము చదువునట్లు:

> అప్పుడు యెహోవా మోషేతో ఇట్లనెను—నీవు కొండయెక్కి నాయొద్దకు వచ్చి అచ్చటనుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మశాస్త్రమును, రాతిపలకలను నీకిచ్చెద[ను] (నిర్గమ. 24:12).

ఒక విషయం ఏమిటంటే, ఉపదేశముల గ్రంథమునకు అనుగుణంగా మోషే లిఖించిన నిబంధన గ్రంథమునకు భిన్నముగా, పది ఆజ్ఞలను దేవుడు స్వయంగా రాతి పలకల మీద వ్రాశాడు.

దేవుడు స్వయంగా పది ఆజ్ఞలను రాతి పలకల మీద వ్రాశాడు అని ద్వితీ. 9:10 నిర్ధారిస్తుంది. అక్కడ మోషే ఇలా ప్రకటించాడు:

> అప్పుడు దేవుని వ్రేలితో వ్రాయబడిన రెండు రాతి పలకలను యెహోవా నాకప్పగించెను (ద్వితీ. 9:10).

తానే స్వయంగా పది ఆజ్ఞలను వ్రాయుట ద్వారా, తన ఆజ్ఞలన్నిటిలో పది ఆజ్ఞలు విశేషమైనవి అని, అవి విశేషమైన ధ్యాసను పొందుటకు యోగ్యమైనవని, మరియు వాటిలో కొన్ని ఒక భావనలో, ఆయన ఆజ్ఞలన్నిటిలో అత్యంత ప్రాముఖ్యమైనవి అని దేవుడు కనుపరచాడు.

పది ఆజ్ఞల యొక్క వేదాంత ప్రాధాన్యత ఇశ్రాయేలు వాటిని పొందుకొనిన విశేషమైన సందర్భమును కూడా సూచిస్తుంది. పది ఆజ్ఞలు ఇవ్వబడినప్పుడు ఉరుములు మరియు మెరుపులు, పొగ, మేఘములు, మరియు ఆకాశ బూరల ధ్వని కలిగింది. ఈ సమయమందు, మోషే మాత్రమేగాక, యెహోషువ, అహరోను, మరియు ఇశ్రాయేలు యొక్క డెబ్బది నాయకులకు దేవుడు తనను తాను కనుపరచుకున్నాడు.

పది ఆజ్ఞల యొక్క వేదాంత ప్రాధాన్యత ద్వితీ. 4:13లో కూడా ఉద్ఘాటించబడింది, అక్కడ మోషే పది ఆజ్ఞలను దేవుడు స్వయంగా తన ప్రజలతో చేసిన నిబంధనగా గుర్తించాడు.

> మరియు మీరు చేయవలెనని ఆయన విధించిన నిబంధనను, అనగా పది ఆజ్ఞలను [దేవుడు] మీకు తెలియజేసి రెండు రాతి పలకలమీద వాటిని వ్రాసెను (ద్వితీ. 4;13).

అంతేగాక, నిర్గమ. 40:20 ప్రకారం, పది ఆజ్ఞలు ఇశ్రాయేలులో దేవుని సన్నిధి ఉన్నది అనుటకు గురుతుగా ఉన్న మతపరమైన వస్తువు మరియు దేవుని పాదపీఠమైన నిబంధన మందసములో కూడా ఉంచబడినవి. నిబంధన గ్రంథము మరియు మిగిలిన నియమములకు విశేషమైన గుర్తింపు ఇవ్వబడలేదు. ఉదాహరణకు, మత్తయి 19:17-19లో, యేసు మరియు నిత్యజీవమును పొందుటను గూర్చి ప్రశ్నించిన ఒక వ్యక్తికి మధ్య జరిగిన సంభాషణలో మనము ఇలా చదువుతాము:

> అందుకాయన [యేసు] … నీవు జీవములో ప్రవేశింపగోరినయెడల ఆజ్ఞలను గైకొనుమని చెప్పెను. అతడు –ఏ ఆజ్ఞలని ఆయనను అడుగగా యేసు–నరహత్య చేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలవద్దు, అబద్ధ సాక్ష్యము పలుకవద్దు, తలిదండ్రులను సన్మానింపుము, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను అనునవియే అని చెప్పెను (మత్తయి 19:17-19).

పొరుగువానిని ప్రేమించుట మినహా యేసు ఇక్కడ తెలిపిన ఆజ్ఞలు పది ఆజ్ఞలకు చెందినవి, మరియు అది లేవీయ. 19:18 నుండి వెలువడుతుంది మరియు పది ఆజ్ఞలలో నుండి యేసు ప్రస్తావించిన ఆజ్ఞలను క్రోడీకరిస్తుంది. క్లుప్తంగా, పది ఆజ్ఞలను పాటించుట ద్వారా ఒక మనుష్యుడు నిత్యజీవమును పొందగలడు అని యేసు సూచించాడు. అవును, ఈ ఆజ్ఞలన్నిటిని పాటించు మంచితనము ఏ ఒక్కరికీ లేదు అని యేసు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

బోధించాడు. అయితే యేసు పది ఆజ్ఞల యొక్క ప్రాముఖ్యతను ఒక విశేషమైన రీతిలో నిర్ధారించాడు అను విషయమును మాత్రం మనము చర్చించాలి. క్రొత్త నిబంధనలో కూడా, వాటి వేదాంత ప్రాధాన్యతను ప్రతిబింబించు విధముగా పది ఆజ్ఞలను గూర్చి మాట్లాడబడింది.

బైబిలు పది ఆజ్ఞలకు ఇచ్చు చారిత్రిక మరియు వేదాంత ప్రాధాన్యత చరిత్ర అంతటిలో క్రైస్తవ మరియు యూదుల పరంపరలలో కూడా గుర్తించబడింది మరియు ప్రతిబింబించబడింది. ఉదాహరణకు, సమాజమందిరములు సాధారణంగా పది ఆజ్ఞల యొక్క చిత్రములను కలిగియుండేవి. మరియు క్రైస్తవ ప్రతిమాశాస్త్రములో కూడా ఆజ్ఞలను కలిగియున్న రాతి పలకలు సర్వసాధారణమైయున్నవి. అంతేగాక, ఆజ్ఞలు క్రైస్తవ సాహిత్యములో కూడా ప్రాముఖ్యమైన భాగమైయున్నవి. క్లుప్తంగా, దేవుని ధర్మశాస్త్రములోని ఈ భాగము లేఖనములోని ఇతర నైతిక హెచ్చరికల పై విశేషమైన ప్రాధాన్యత కలిగియున్నదని అనేక శతాబ్దముల పాటు క్రైస్తవ మరియు యూదుల పరంపరలు సమ్మతించాయి.

పది ఆజ్ఞల మీద లేఖనములు ఉంచు ప్రాముఖ్యతను మరియు ప్రాధాన్యతను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు లేఖనములో మనము చూసే మూడు రకముల సాంప్రదాయిక విభాగములను, లేక ఆజ్ఞల రకములను మనము చూద్దాము.

## మూడు రకముల ఆజ్ఞలు

సంఘము యొక్క అనేక ప్రొటెస్టెంట్ శాఖలలో, పాత నిబంధనలోని అనేక ఆజ్ఞలను మూడు ప్రధానమైన గుంపులుగా విభాగించుట సామాన్యమైయున్నది: నైతిక ఆజ్ఞలు, ఆచార ఆజ్ఞలు, మరియు పౌర ఆజ్ఞలు. నైతిక ఆజ్ఞలు దేవుని నైతిక ప్రామాణికతలను తెలియపరుస్తాయి మరియు సాధారణంగా పది ఆజ్ఞలు నైతిక ఆజ్ఞలైయున్నాయి. పౌర ఆజ్ఞలు ముఖ్యముగా ఇశ్రాయేలును దేవుడు పరిపాలించిన కాలములో సమాజమును నిర్వహించుటకు ఉపయోగించబడినవి. ఆచార ఆజ్ఞలు, దేవుని ఆరాధించుటకు సూచనలను అందిస్తాయి. చాలాసార్లు, ఇవి పాత నిబంధన బలుల వ్యవస్థ, మందిరము మరియు దేవాలయ నిర్వహణతో దగ్గర సంబంధము కలిగియున్నవి.

ఈ భిన్నత్వములు సంఘ చరిత్రలో చాలా ప్రాముఖ్యమైన పాత్రను పోషించాయి కాబట్టి వీటిని మనము జాగ్రత్తగా పరిశీలన చేద్దాము, మొదటిగా సాంప్రదాయిక విభజనల యొక్క ప్రాముఖ్యమైన అర్హతలను కొన్నింటిని చూద్దాము; రెండవదిగా, ఈ విభజనల యొక్క విలువను ఉద్ఘాటిద్దాము; మరియు మూడవదిగా, ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక విభాగములను నీతిశాస్త్ర అధ్యయనమునకు సరిగా అనువర్తించు విధానమును చర్చిద్దాము. పాత నిబంధన ఆజ్ఞల యొక్క మూడింతల విభజనకు కొన్ని అర్హతలను గూర్చి ముందు ఆలోచన చేద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## అర్హతలు

ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక మూడింతల విభజనను గూర్చి అనేక మంచి విషయములను చెప్పవచ్చుగాని, లేఖనములోని ఆజ్ఞలను విభాగించు విషయములో కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతాయి. మొదటిగా, మూడు సాంప్రదాయిక విభాగములు బైబిలులో స్పష్టముగా బోధించబడలేదు అని అనేకమంది బైబిలు పండితులు సరిగానే గుర్తిస్తారు. అనగా, ఏ ఆజ్ఞలు ఏ విభాగములకు చెందవని వివరించు ఉపదేశములు కాదుకదా, నైతిక, ఆచార మరియు పౌర ఆజ్ఞలు అని పిలువబడు విభిన్నమైన ఆజ్ఞల రకములు ఉన్నాయని లేఖనములో ఎక్కడా స్పష్టమైన కథనము కూడా లేదు. ఇప్పుడు, ఈ విభాగములు అనేక విధములుగా ఆమోదించబడినవి, కాని ఇవి అన్ని విధములుగా స్పష్టమైనవిగా ఉన్నాయని మనము ఆలోచించకూడదు.

రెండవదిగా, కొన్ని ఆజ్ఞలు ఒక విభాగము కంటే ఎక్కువ భాగములకు చెందినవైయున్నవి అని లేఖనము స్పష్టముగా తెలియజేస్తుంది. ఉదాహరణకు, నిర్గమ. 20:8-11లో, విశ్రాంతి దినమును ఆచరించమని ఇవ్వబడిన ఆజ్ఞ పది ఆజ్ఞలలో, అనగా నైతిక ఆజ్ఞలలో స్పష్టముగా ఉంచబడింది. అయినను, విశ్రాంతి దిన ఆజ్ఞ నిర్గమ. 31:14-16లో ఉన్న ఇశ్రాయేలు యొక్క ఆరాధనా ఆచారముల సంపుటిలో కూడా భాగమైయున్నది.

నరహత్యను నిషేధించు ఆజ్ఞను లేఖనము నైతిక మరియు పౌర నియమముగా విశేషముగా గుర్తిస్తుంది. ఈ ఆజ్ఞ నిర్గమ. 20:13లో పది ఆజ్ఞలలో కూడా భాగమైయున్నది, కాబట్టి నైతిక ఆజ్ఞ కూడా అయ్యున్నది. కాని హంతకులను ప్రభుత్వము శిక్షించాలని స్పష్టముగా చెబుతూ పాత నిబంధన హత్యను పౌర నియమముగా కూడా చేస్తుంది.

కాబట్టి, మనము పాత నిబంధన ఆజ్ఞలను చూచుచుండగా, అనేక ఆజ్ఞలు ఒకటి కంటే ఎక్కువ విభాగములకు చెందినవిగా ఉంటాయని మనము జ్ఞాపకముంచుకోవాలి. వాస్తవానికి, పాత నిబంధనలోని ఆజ్ఞలన్నిటిలో నైతిక, పౌర, మరియు ఆచార అంశములు ఉంటాయి అని చెప్పుట సబబే అవుతుంది.

దీనిని గూర్చి ఈ విధంగా ఆలోచించండి. ఒక వాక్యభాగములో ఏది అత్యంత స్పష్టముగా కనిపించినా, ప్రతి ఆజ్ఞ నైతికతకు ప్రామాణికత అయ్యున్నది; ప్రతి ఆజ్ఞ పౌర ఆజ్ఞల ద్వారా నియంత్రించబడిన సామాజిక అనుబంధముల మీద ప్రత్యక్షమైన లేక పరోక్షమైన ప్రభావము కలిగియుంటుంది; మరియు ఏదో ఒక విధముగా, ఆజ్ఞలన్నిటిని పాటించుట మరియు ఉల్లంఘించుట ఇశ్రాయేలు ప్రజలు ఆరాధనా ఆచారములలో పాలుపంచుకొనిన విధానము మీద ప్రభావము చూపాయి. ఈ కారణము చేత, ప్రతి ఆజ్ఞను ఆజ్ఞల విభాగములలో ఒకదానిలో ఉంచుట కంటే ఆజ్ఞలలోని పలు "అంశములను" గూర్చి మాట్లాడుట ఉత్తమమైన పనియైయున్నది.

ఈ అర్హతలు ఉన్నప్పటికీ, దేవుడు తన ధర్మశాస్త్రమును తన ప్రజలకు అనువర్తించాలని ఉద్దేశించిన విధానమును అర్థము చేసుకొను విషయములో సాంప్రదాయిక మూడింతల విభజనకు విశేషమైన విలువ ఉన్నది అని మనము ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవాలి,

## విలువ

మొదటిగా, ధర్మశాస్త్రము దేవుని ప్రజల జీవితముల కొరకు ఆయన కలిగియున్న సంగ్రహ ప్రామాణికత అని స్పష్టముగా చూచుటలో సాంప్రదాయిక మూడింతల విభజన మనకు సహాయము చేస్తుంది. ధర్మశాస్త్రము జీవితములోని ఒక చిన్న భాగమును మాత్రమే నియంత్రించదు; అది జీవితమంతటిని నియంత్రిస్తుంది. ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక మూడింతల విభజన ఇశ్రాయేలు యొక్క దైవ అధికార కాలములో ప్రభుత్వము చేసిన మూడు స్థానముల మధ్య, అనగా ప్రవక్త, యాజకుడు మరియు రాజు మధ్య లేఖనము వెలికితీసిన నిజాయితీగల వ్యత్యాసమును ప్రతిబింబిస్తుంది కాబట్టి ఇది స్పష్టమైయున్నది. నైతిక ఆజ్ఞలు నీతి కొరకు దేవుని ఆజ్ఞలను తెలియజేయు ప్రవక్త స్థానమునకు దగ్గర సంబంధమును కలిగియున్నవి. ఆచార నియమములు యాజక స్థానములో చక్కగా అమర్చబడతాయి, ఎందుకంటే అవి ప్రాయశ్చిత్తము వంటి యాజకులు చేయు కార్యములతో దగ్గర సంబంధమును కలిగియున్నవి. మరియు పౌర ఆజ్ఞలు దేవుని నిబంధన ప్రజల యొక్క ప్రభుత్వ పాలకుడైన రాజ స్థానముతో దగ్గర సంబంధమును కలిగియున్నవి.

రెండవదిగా, బైబిలు పూర్తిగా వివరించని ఆజ్ఞలను వ్యాఖ్యానించుటలో ఈ మూడింతల విభజన మనకు సహాయము చేస్తుంది. పోలికలు కలిగిన ఆజ్ఞలను ఒక సమూహముగా చేర్చుట ద్వారా, బైబిలు ఎక్కువ వివరణలు ఇవ్వని అనేక ఆజ్ఞల యొక్క వాస్తవిక అర్థము మరియు అనువర్తనమును వేదాంతవేత్తలు సరిగా నిర్ధారించగలుగుతారు. ఎందుకంటే, ఒక ఆజ్ఞను అనువర్తించుటను గూర్చి బైబిలు మనకు ఎంతో సమాచారమును ఇచ్చి, దానిని పోలిన మరొక నియమము విషయములో చాలా తక్కువ సమాచారమును ఇచ్చునప్పుడు, మొదటిదాని మెళకువలను ఉపయోగించి రెండవదానిని అర్థము చేసుకొనుట సమంజసమే అవుతుంది.

ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక విభజనను గూర్చిన కొన్ని అర్హతలను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి మరియు లేఖనమును అర్థము చేసుకొనుటకు దాని యొక్క విలువను ఉద్ఘాటించాము కాబట్టి, ఇప్పుడు మన ధ్యాసను మన మూడవ అంశము వైపుకు త్రిప్పాలి: ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక మూడింతల విభజనను నీతిశాస్త్ర అధ్యయనమునకు సరియైన రీతిలో అనువర్తించుట.

## అనువర్తనము

పాత నిబంధన ధర్మశాస్త్రము యొక్క సాంప్రదాయిక విభాగముల మాన్యతను అనేకమంది వేదంతవేత్తలు సమ్మతించినప్పటికీ, నీతిశాస్త్ర అధ్యయనము కొరకు ఈ విభాగములు ఎలా అనువర్తించాలి

అను విషయమునకు చాలాసార్లు వారు అసమ్మతిని వ్యక్తం చేస్తారు. ఆజ్ఞల విభాగములన్నీ ఆధునిక క్రైస్తవులకు అనువర్తించబడవు అని కొందరు చెప్పారు. వారి ఆలోచన ప్రకారం, ఈ విభాగముల యొక్క ఉనికి, మరియు ఆజ్ఞలను సరియైన రీతిలో గుర్తించుట, దేవుని వాక్యమును వారి జీవితములకు అనువర్తించకుండా నివారించు పద్ధతులను అందిస్తుంది. వ్యక్తిగత ఆజ్ఞలు అన్ని ఇప్పటికీ అనువర్తించబడతాయిగాని కేవలం వాటి యొక్క కొన్ని అంశముల విషయములో మాత్రమే అనువర్తించబడతాయని ఇతర వేదాంతవేత్తలు తెలిపారు. అయితే ప్రతి ఆజ్ఞ యొక్క ప్రతి అంశము ప్రతి క్రైస్తవుని జీవితమునకు ఏవిధంగా అనువర్తించబడాలో చూచుటకు మాత్రమే సాంప్రదాయిక విభాగములు సహాయము చేస్తాయని మరికొందరు వాదించారు.

ఉదాహరణకు, *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* 19వ అధ్యాయము, 3వ భాగమును పరిగణించండి:

> ఆచార ఆజ్ఞలు అన్ని ఇప్పుడు క్రొత్త నిబంధన క్రింద కొట్టివేయబడినవి.

క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానము మరియు ఆరోహణ సమయము మొదలు, మోషే బలుల మరియు దేవాలయ వ్యవస్థ కోరిన అనేక పనులను దేవుని ప్రజలు ఇక చేయనవసరము లేదు అను వాస్తవమును ఈ కథనము ప్రతిబింబిస్తుంది. మనము దేవాలయమును నిర్వహించవలసిన పని లేదు, లేక స్త్రీలు మరియు అన్యులు దేవుని పరిశుద్ధ సన్నిధికి రాకుండా నిషేధించవలసిన పనిలేదు, లేక మన పాపముల కొరకు జంతు బలులు అర్పించవలసిన పనిలేదు.

పౌర ఆజ్ఞల విషయములో కూడా *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* ఇలాంటి వ్యాఖ్యనే చేస్తుంది, కాని పౌర ఆజ్ఞలలోని సామాన్య విషయములు, లేక మౌలిక నైతిక నియమములు అనువర్తించబడుట కొనసాగుటను అనుమతిస్తుంది. 19వ అధ్యాయము, 4వ భాగములో అది ఇశ్రాయేలు యొక్క పౌర ఆజ్ఞలను గూర్చి మాట్లాడుతూ, ఇలా సెలవిస్తుంది:

> రాజకీయ ప్రజలుగా వారికి ఆయన నానావిధములైన న్యాయపరమైన నియమములను ఇచ్చాడు, మరియు అవి ఆ ప్రజలతో ముగించబడినవి, మరియు అవసరమైన విధముగా సాధారణ విధానములో మినహా నేటికి అవి వర్తించబడవు.

మరొకసారి, ఇక్కడ సామాన్య ఆలోచన ఏమనగా పౌర నియమములలోని కొన్ని షరతులు నేడు వర్తించవు; అవి "పాతగిలినవి."

ఇప్పుడు, విశ్వాసులు పాత నిబంధనలో తెలియజేయబడిన అనేక మార్గములను, ముఖ్యముగా పాత నిబంధన ఆచారములు మరియు పౌర ప్రభుత్వమునకు సంబంధించిన నియమములను అనుసరించి నడుచుకోవలసిన అవసరము లేదు అను మాట వాస్తవమే. ఈ ప్రవర్తనలను క్రొత్త నిబంధన యొక్క సంపూర్ణ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రత్యక్షత భర్తీ చేసింది. పాత నిబంధన పౌర మరియు ఆచార ఆజ్ఞలు ఏవిధంగా "పాతగిలినవంటే" పాత నిబంధన జీవన విధానములలోనికి మనము మరలా తిరిగి వెళ్లవలసిన పని లేదు.

అయితే మరొక భావనలో పాత నిబంధన పౌర మరియు ఆచార ఆజ్ఞలు ఆధునిక క్రైస్తవులకు అనువర్తించబడతాయి అని గ్రహించుట కూడా కీలకమైయున్నది. పౌర మరియు ఆచార ఆజ్ఞలు నేడు నైతిక ఆజ్ఞల వలెనే దేవుని ప్రామాణికతగా మనలను నడిపిస్తాయి.

క్రైస్తవులు ఇప్పటికీ నైతిక మార్గదర్శకము కొరకు పాత నిబంధనలోని ఆచార ఆజ్ఞలను, నైతిక ఆజ్ఞలను చూడవలసియున్నది అనుటకు కనీసం నాలుగు కారణాలు ఉన్నాయి.

మొదటిగా, ఈ ఆజ్ఞలు అందించు ప్రత్యక్షతలో నుండి మనము నేర్చుకోవాలని దేవుని గుణము కోరుతుంది. మనము ఇంతకు ముందే చూసినట్లు, దేవుని గుణము నీతిశాస్త్రము కొరకు మన ఉన్నతమైన ప్రామాణికత అయ్యున్నది. మరియు పాత నిబంధన ధర్మశాస్త్రము దేవుని గుణమును ప్రతిబింబిస్తుంది; అది దేవుడు ఎవరు మరియు ఆయన ఏవిధముగా ఉన్నాడు అనుటకు ప్రత్యక్షత అయ్యున్నది. మరియు దేవుని గుణము మార్పుచెందలేదు. అనగా దేవునిని గూర్చి పాత నిబంధనలో ధర్మశాస్త్రము బయలుపరచిన సమస్తము నేటికి కూడా వాస్తవమైయున్నది. క్లుప్తంగా, పాత నిబంధనలోని పౌర మరియు ఆచార ఆజ్ఞలు నేటికి మన నైతిక ప్రామాణికతను బయలుపరుస్తాయి.

రెండవదిగా, స్వయంగా లేఖనము కూడా ప్రతి చిన్న పాత నిబంధన ఆజ్ఞ యొక్క ఆధునిక అనువర్తనమును బోధించుట కొనసాగిస్తుంది. ఉదాహరణకు, మత్తయి 5:18-19లో యేసు ఇలా బోధించాడు:

> ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పి పోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. కాబట్టి యీ యాజ్ఞలలో మిగుల అల్పమైన యొకదానినైనను మీరి, మనుష్యులకు ఆలాగున చేయ బోధించువాడెవడో వాడు పరలోకరాజ్యములో మిగుల అల్పుడనబడును; అయితే వాటిని గైకొని బోధించువాడెవడో వాడు పరలోక రాజ్యములో గొప్పవాడనబడును (మత్తయి 5:18-19).

యేసు మాటల ప్రకారం, "ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు" ప్రతి ఆజ్ఞ దేవుని ప్రామాణికతను బయలుపరచుట కొనసాగిస్తుంది. అయితే ఇంకా సమస్తము నెరవేరలేదు — క్రీస్తు ఇంకా తిరిగిరాలేదు. ఆయన తిరిగివచ్చు వరకు, ప్రతి చిన్న ఆజ్ఞను బోధించాలి మరియు పాటించాలి. కాబట్టి, ఏదో ఒక విధముగా, పౌర మరియు ఆచార ఆజ్ఞలు కూడా మన జీవితముల కొరకు దేవుని ప్రమాణములను బోధించుట కొనసాగిస్తాయి.

మూడవదిగా, ఆచార, పౌర లేక నైతిక విభజనల మధ్య వ్యత్యాసములతో నిమిత్తం లేకుండా ధర్మశాస్త్రము ఒక ఐక్య భాగము అయ్యున్నదని, ఇప్పటికీ కలిసి ఉన్నదని బైబిలు ఏకకంఠముతో బోధిస్తుంది. ఉదాహరణకు, యాకోబు 2:10-11లో మనము ఈ మాటలను చదువుతాము:

> ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞవిషయములో తప్పిపోయినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధి యగును; వ్యభిచరింపవద్దని చెప్పినవాడు నరహత్యచేయ వద్దనియు చెప్పెను (యాకోబు 2:10-11).

యాకోబు మనస్సులో, ధర్మశాస్త్రము విడదీయజాలనిది, ఎందుకంటే అది ఒకే దేవుని నుండి వచ్చింది.

నాల్గవదిగా, ప్రతి లేఖనము, కొన్ని భాగములు మాత్రమేకాదు, మన నైతిక ఉపదేశము కొరకు ఇవ్వబడినది. అనగా, ఆచార మరియు పౌర ఆజ్ఞలు మరియు నైతిక ఆజ్ఞలు కూడా ఆధునిక నీతిశాస్త్రమును గూర్చి ఎంతో కొంత బోధిస్తాయి. 2 తిమోతి 3:16లో పౌలు వ్రాసినట్లు:

> . . . దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమోతి 3:16).

ఇక్కడ పౌలు ఎలాంటి విశేషతలను తెలియజేయలేదు అను విషయమును గమనించండి. భిన్నముగా, అతడు "ప్రతి లేఖనము"ను చేర్చాడు. అనగా నీతి మార్గములలో మనలను తర్ఫీదు చేయుటకు ఆచార మరియు పౌర నియమములు కూడా ఉపయోగపడతాయి.

ఇప్పుడు, పౌర మరియు ఆచార ఆజ్ఞలు క్రైస్తవ నీతిశాస్త్రములో మన నైతిక ప్రామాణికతలో భాగమైయున్నవి అని గ్రహించుట ప్రాముఖ్యమైన మొదటి అడుగు అయ్యున్నది. అయితే మన నైతిక మూల్యాంకనాలలో ఇట్టి ఆజ్ఞలను ఎలా చేర్చాలో తెలుసుకొనుట కూడా చాలా ప్రాముఖ్యమైయున్నది. ఎందుకంటే, మనము ఈ ఆజ్ఞల విషయములో పాత నిబంధన ప్రవర్తనలను ఊరకనే అనుసరించవలసిన పని లేదు అని నిర్ధారించాము. కాబట్టి, ఈ ఆజ్ఞలను మనము ఏమి చేయాలి? మనము ఏ అనువర్తన ప్రక్రియను అనుసరించాలి?

ఈ పాఠ్యక్రమములోని పాఠములన్నిటిలో, నైతిక నిర్ణయములలో ఒక వ్యక్తి ఒక పరిస్థితికి దేవుని వాక్యమును అనువర్తించుట భాగమైయున్నది అని మనము ఉద్ఘాటించాము. ఫలితంగా, ఏ ఆజ్ఞ యొక్క ప్రామాణికతను అయినా, అది నైతిక, పౌర, లేక ఆచార అంశములలో దేనినైనా ఉద్ఘాటించవచ్చు, అది అనువర్తించబడు పరిస్థితి మరియు దానిని అనువర్తించు వ్యక్తిని పరిగణించకుండా సరిగా అర్థము చేసుకోలేము

లేక అనువర్తించలేము. మరియు ఆ పరిస్థితి లేక వ్యక్తి యొక్క వివరములు మారిన ప్రతిసారి, దేవుని వాక్యము యొక్క అనువర్తన ఎంతో కొంత భిన్నముగా ఉంటుందని మనము ఆశించవచ్చు.

ఉదాహరణ కొరకు, పాత నిబంధనలో ఒక పౌర నియమము చారిత్రిక సందర్భమునకు అనువర్తించబడిన ఒక సన్నివేశమును మనము పరిగణించుట సహాయకరముగా ఉంటుంది. కాబట్టి, సంఖ్యాకాండము 27వ అధ్యాయములో ప్రస్తావించబడిన సెలోపెహాదు కుమార్తెల సన్నివేశమును పరిగణించండి. వాగ్దాన దేశమును పంచిపెట్టుటను గూర్చి దేవుడు ఇంతకు ముందు ఇచ్చిన ఆజ్ఞల ప్రకారం, భాగములు కుటుంబములకు ఇవ్వబడాలి, మరియు కుమారులు వాటిని పంచుకోవాలి. ఇప్పుడు, సెలోపెహాదు కుమారులు లేకుండా ఐదుగురు కుమార్తెలను కలిగి అరణ్యములో మరణించాడు. దేవుడు ఆజ్ఞాపించిన ఆస్తుల విభజన నియమము ప్రకారం, సెలోపెహాదు కుమార్తెలు తమ తండ్రి భూభాగములో స్వాస్థ్యమును పొందలేరు. కాబట్టి, కుమార్తెలు మోషేకు విజ్ఞాపన చేశారు. సంఖ్యా. 27:3-4లో మనము వారి విజ్ఞాపనను చదువుతాము:

> [మా తండ్రి] … పాపమునుబట్టి మృతిబొందెను. అతనికి కుమారులు కలుగలేదు; అతనికి కుమారులు లేనంత మాత్రముచేత మా తండ్రిపేరు అతని వంశములోనుండి మాసిపోనేల? మా తండ్రి సహోదరులతో పాటు స్వాస్థ్యమును మాకు దయచేయుమనిరి (సంఖ్యా 27:3-4).

ఇప్పుడు, ఈ ఆజ్ఞ ఎలాంటి పరిగణలు లేకుండా అమలుచేయబడాలని దేవుడు ఉద్దేశించియుంటే, ఈ సమస్యకు జవాబు ఖచ్చితముగాను స్పష్టముగాను ఉండేది. నియమము ప్రకారం, సెలోపెహాదు కుమార్తెలు వాగ్దాన దేశములో స్వాస్థ్యమును పొందుకునేవారు కారు. అయితే తరువాత వచనములో, ఒక అసాధారణమైన సన్నివేశము జరిగింది. సంఖ్యా. 27:5లోని మాటలను వినండి:

> అప్పుడు మోషే వారి కొరకు యెహోవా సన్నిధిని మనవిచే[సెను] (సంఖ్యా. 27:5).

ఇది అద్భుతమైన విషయము కాదా? మోషే ఆస్తుల విభజనను గూర్చిన నియమమును తెలియజేశాడు మరియు ఇశ్రాయేలులో ఉన్నతమైన న్యాయాధిపతి అయ్యున్నాడు. ఆ దేశములో ఇతరులందరి కంటే ఎక్కువగా, దేవుని మార్గములను గూర్చి మరియు దేవుని ధర్మశాస్త్ర వివరములను గూర్చి ఎంతో సన్నిహిత జ్ఞానము కలిగియున్నాడు. ఈ సన్నివేశమును ఎవరైనా సరిగా పరిష్కరించగలరు అంటే, అతడు మోషేనే అయ్యుండాలి. కాబట్టి, ఏ నిర్ణయము తీసుకోవాలో అతనికి ఎందుకు తెలియదు?

దేవుడు తనకు ఇచ్చిన ధర్మశాస్త్రము కుమారులు ఉన్న సందర్భములను నియంత్రించుటకు రూపొందించబడింది అని మోషే అర్థము చేసుకున్నాడు. మరియు ప్రతి కుటుంబము యొక్క స్థానమును

దాని గోత్రములో భద్రపరచి, గోత్ర భూముల కేటాయింపులను కాపాడుట ఈ నియమము యొక్క లక్ష్యమైయున్నది అని అతనికి తెలుసు. అయితే సెలోపెహాదు కుమార్తెల విషయములో, ఈ నియమము ద్వారా బయలుపరచబడిన ప్రామాణికతను ఒక క్రొత్త పరిస్థితికి ఎలా అనువర్తించాలి అను సమస్యను మోషే ఎదుర్కొన్నాడు. క్రొత్త పరిస్థితి తాను ఈ నియమమును అనువర్తించవలసిన విధానమును ప్రభావితము చేస్తుంది అని అతనికి తెలుసు కాబట్టి అతనికి దేవుని సహాయము అవసరమైయుండినది. మరియు దేవుని ప్రతిస్పందన గమనించదగినది. సంఖ్యా. 27:7-8లో దేవుడు సెలవిచ్చిన మాటలు వినండి:

> సెలోపెహాదు కుమార్తెలు చెప్పినది యుక్తము ... నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లు చెప్పవలెను— ఒకడు కుమారుడు లేక మృతి బొందినయెడల మీరు వాని భూస్వాస్థ్యమును వాని కుమార్తెలకు చెందచేయవలెను (సంఖ్యా. 27:7-8).

ఒక వ్యక్తి స్వాస్థ్యము తన కుమారులకుగాక ఇతరులకు చెందిన అనేక ఇతర సందర్భములను తెలియజేస్తూ వాక్యభాగము కొనసాగుతుంది. అయితే మేము చెప్పగోరు విషయము ఇదే: తన గుణములోని ఒకే అంశమును విభిన్నమైన పరిస్థితులలో విభిన్నమైన విధానములలో అనువర్తించాలని దేవుడు సూచించాడు. అనేక విధాలుగా, క్రైస్తవులు కూడా మోషే ఎదుర్కొనిన ఇదే సమస్యను ఎదుర్కొంటారు: మన యొద్ద దేవుని ధర్మశాస్త్ర ప్రామాణికత ఉన్నది, అయితే దీనిని మనము ఒక క్రొత్త పరిస్థితికి అనువర్తించాలి. ధర్మశాస్త్రమంతటిని క్రీస్తు మరియు ఆయన కార్యము వెలుగులో పునఃవ్యాఖ్యానించాలి మరియు అనువర్తించాలి.

యాజకునిగా, క్రీస్తు ధర్మశాస్త్రములో ఉన్న ఆచార అంశములను నెరవేర్చాడు. ధర్మశాస్త్రము యొక్క ఆచార నియమములు ఇప్పటికీ వర్తిస్తాయి, మరియు క్రీస్తును మన బలిగా నమ్ముట ద్వారా, మరియు ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధించుట ద్వారా మనము వాటిని అనుసరించాలి.

రాజుగా, క్రీస్తు ధర్మశాస్త్రములోని పౌర అంశములను నెరవేర్చాడు. మరియు భూమి మీద ఆయన దేశమైయున్న సంఘము క్రీస్తు యొక్క గొప్ప ప్రభుత్వము ఆధీనములో ఉన్న మన భూలోక ప్రభుత్వముల ఆధీనములో సరిగా జీవించుట ద్వారా మాత్రమేగాక, క్రీస్తును రాజుగా ప్రత్యక్షముగా ఘనపరచుట ద్వారా మరియు ఆయన ఆజ్ఞలను పాటించుట ద్వారా ఈ అంశములకు విధేయత చూపవలసియున్నది.

చివరిగా, ప్రవక్తగా, క్రీస్తు ధర్మశాస్త్రములోని నైతిక అంశములను నెరవేర్చుతాడు. దేవుని ఎదుట మనము అంగీకరించబడుటకు ఆధారముగా మనము కేవలం క్రీస్తు నైతికత మీద ఆధారపడతాము. అయినను, మనలను మనము క్రీస్తు స్వరూపముకు మరియు మాదిరికి అనుగుణ్యము చేసుకొని, ఆయన తన భూలోక పరిచర్య కాలములోను మరియు ఇప్పుడు పరలోకమందు ఉన్న విధముగా నైతికముగా జీవించుటకు ప్రయత్నించాలి.

సారాంశములో, నైతిక, ఆచార మరియు పౌర ఆజ్ఞల విభాగములు అనేక విధాలుగా, ముఖ్యముగా వాటిని మనము విభిన్నమైన విభాగములుగా గాక ప్రతి ఆజ్ఞలోని అంశములుగా ఆలోచించినప్పుడు, సహాయకరముగా ఉన్నాయి. అయితే ఈ విభాగములను ఏనాడు దేవుని ఆజ్ఞలలోని ఒక భాగమును లేక అంశమును నిర్లక్ష్యము చేయుటకు ఆధారముగా ఉపయోగించకూడదు. మనము ఇంతకు ముందు చూసినట్లు, దేవుని ఆజ్ఞలు అన్నీ నైతికత కొరకు మన ప్రామాణికతగా మిగిలియుంటాయి, మరియు దేవుని ధర్మశాస్త్రము అంతటిని మన ఆధునిక పరిస్థితికి అనువర్తించుటకు మనము బద్ధులమైయున్నాము. దేవుని ధర్మశాస్త్రములోని ప్రతి చిన్న మాట క్రైస్తవ నీతిశాస్త్రము కొరకు ఒక ప్రమాణముగా పని చేస్తుంది.

లేఖనము యొక్క విభిన్నతను గూర్చి, లేఖనములో దేవుని ధర్మశాస్త్రమును గూర్చి ఇప్పటి వరకు ఒక సాధారణమైన ధోరణిని మనము స్థాపించాము కాబట్టి, ఇప్పుడు ధర్మశాస్త్రము దేవుని యొక్క వ్రాయబడిన ప్రత్యక్షతలోని ఇతర భాగములకు అనుసంధానపరచబడు విధానములను పరిగణిస్తూ లేఖనము యొక్క ఐక్యతను విశదీకరించవలసియున్నది.

## లేఖనము యొక్క ఐక్యత

నేటి సంఘములో బైబిలు బోధకులు ఇలాంటి విషయములను చెబుతుండగా వినుట చాలా సామాన్యమైన విషయమైయున్నది, "క్రైస్తవులు ధర్మశాస్త్రమునకు విధేయత చూపవలసిన అవసరము లేదు — మనము కేవలం సువార్తను నమ్మాలి అంతే," లేక "దేవుడు మనము అనుసరించాలని కోరు ధర్మశాస్త్రము కేవలం ప్రేమ ధర్మశాస్త్రము అంతే." ఇప్పుడు, ఈ విషయములను గూర్చి బైబిలు చెప్పునదంతా సంపూర్ణముగా స్పష్టముగా లేదు అని ఒప్పుకోవాలి. అయితే బైబిలులోని విషయములన్నిటిని మనము సరిగా విశ్లేషించినట్లయితే, లేఖనము యొక్క ఐక్యత ఎంత గొప్పగా ఉన్నది అంటే బైబిలులో ఉన్న మిగిలిన విషయములన్నిటితో ధర్మశాస్త్రము సంపూర్ణ పొంతన కలిగియున్నది అని మనము కనుగొంటాము.

మన పాఠములోని ఈ భాగములో, లేఖనములోని ఇతర బోధనలతో ధర్మశాస్త్రము సంకర్షించు అనేక విధానములను మనము చూద్దాము. మొదటిగా ధర్మశాస్త్రము ప్రేమ ఆజ్ఞతో అనుబంధము కలిగియున్న విధానమును మనము చూద్దాము. రెండవదిగా, ధర్మశాస్త్రము మరియు కృపా సువార్త మధ్య ఉన్న అనుబంధము మీద మనము దృష్టిపెడదాము. మూడవదిగా, విమోచన చరిత్ర మరియు క్రొత్త నిబంధనతో అనుబంధములో ధర్మశాస్త్రమును పరీక్షిద్దాము. మరియు నాల్గవదిగా, దేవుని ఆజ్ఞలన్నిటి మధ్య ఉన్న సామరస్యము అను విషయమును చూద్దాము. ప్రేమ ఆజ్ఞతో ధర్మశాస్త్రము యొక్క అనుబంధమును చూస్తూ ఆరంభిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ప్రేమ ఆజ్ఞ

"ప్రేమ ఆజ్ఞ"ను గూర్చి మనము మాట్లాడునప్పుడు, మనము దేవుని ప్రేమించవలెను అను మొదటి మరియు అత్యంత ప్రాముఖ్యమైన ఆజ్ఞను గూర్చి మాట్లాడుతున్నాము. మరియు ఈ ఆజ్ఞ యొక్క అంతర్భావములో నుండి, మనము ఒకరినొకరు ప్రేమించుట అను ఆజ్ఞను కూడా సంబోధించుచున్నాము. ఈ ఆజ్ఞలలో ఏదీ పది ఆజ్ఞలలో కనిపించకపోయినప్పటికీ, ఈ రెంటికి మనము గుర్తించవలసిన ఒక ప్రాధాన్యత ఉన్నది. మత్తయి 22:37-40లో యేసు సెలవిచ్చినట్లు:

> అందుకాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెనననునదియే. ఇది ముఖ్య మైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను (మత్తయి 22:37-40).

ఇక్కడ, దేవుని ప్రేమించమని ఇవ్వబడిన ఆజ్ఞ ఆజ్ఞలన్నిటిలో గొప్పది అని యేసు గుర్తించాడు. మన పొరుగువారిని ప్రేమించమను ఆజ్ఞ రెండవ ప్రాముఖ్యమైన ఆజ్ఞ అయ్యున్నది అని కూడా ఆయన సూచించాడు. మరియు ప్రతి ఇతర ఆజ్ఞ ఈ రెండు ఆజ్ఞల మీద ఆధారపడి ఉంటుంది అని కూడా ఆయన బోధించాడు. కాబట్టి, ఏదో ఒక విధముగా ప్రతి ఇతర ఆజ్ఞ మనము దేవుని మరియు మన పొరుగువారిని ఎలా ప్రేమించాలి అనుటకు వర్ణన అయ్యున్నది.

వాస్తవానికి, రోమా. 13:9-10లో పౌలు ఈ మాటలను కూడా సెలవిచ్చాడు:

> ఏలాగనగా ... ఏ ఆజ్ఞయైన ... అదియు నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను వాక్యములో సంక్షేపముగా ఇమిడియున్నవి. ప్రేమ పొరుగువానికి కీడుచేయదు గనుక ప్రేమకలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే (రోమా. 13:9-10).

మరియు గలతీ. 5:14లో అతడు ఇలా వ్రాశాడు:

> ధర్మశాస్త్ర మంతయు—నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్క మాటలో సంపూర్ణమైయున్నది (గలతీ. 5:14).

ఇప్పుడు, పౌలు యొక్క మాటలను చాలా జాగ్రత్తగా చదువుట ప్రాముఖ్యమైయున్నది, ఎందుకంటే క్రైస్తవులు మీ పొరుగువానిని ప్రేమించుము అను ఆజ్ఞ మినహా ధర్మశాస్త్రములో ఏ ఇతర భాగమును పాటించనవసరము లేదు అని ఈ వచనములలో పౌలు బోధించినట్లు ఆలోచించు పొరపాటును అనేకమంది



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వేదాంతవేత్తలు చేశారు. అయితే, వాస్తవానికి, మన పొరుగువానిని ప్రేమించుమను ఆజ్ఞ ఇతర ఆజ్ఞల నుండి వేరుచేయలేనిది అని పౌలు చెబుతున్నాడు, ఎందుకంటే లేఖనములోని ఆజ్ఞలన్ని మన పొరుగువానిని ఎలా ప్రేమించాలో మనకు బోధిస్తాయి. కాబట్టి, మన పొరుగువానిని మనము నిజాయితీగా, పరిపూర్ణముగా ప్రేమించిన యెడల, దేవుడు మనకు ఇచ్చిన ప్రతి ఆజ్ఞను మనము పాటిస్తాము.

మరొక రీతిలో చెబితే, యేసుగాని లేక పౌలుగాని దేవుని మరియు పొరుగువానిని ప్రేమించుమను సులువైన నియమముతో ధర్మశాస్త్రములో ఉన్న పలు నియమములను భర్తీ చేయ ఉద్దేశించలేదు. బదులుగా, దేవుని మరియు పొరుగువానిని ప్రేమించుట అనునది ప్రతి ఆజ్ఞలోను ఒక అంశమైయున్నది, కాబట్టి, పరిపూర్ణముగా ప్రేమించు వ్యక్తి ధర్మశాస్త్రములోని ప్రతి ఆజ్ఞను పాటిస్తాడు అని వారిరువురు బోధించారు. ఉదాహరణకు, ఇంతకు ముందే మనము చదివిన మత్తయి సువార్త వాక్యభాగమును యేసు ఉల్లేఖించిన ద్వితీయోపదేశకాండము 6ను చూడండి: ద్వితీ. 6:1-5లో ఇలా వ్రాయబడియున్నది:

> … నీ దేవుడైన యెహోవాకు భయపడి, నేను నీకాజ్ఞాపించు ఆయన కట్టడలన్నియు ఆజ్ఞలన్నియు నీ జీవిత దినములన్నిటను గైకొనుటకు మీకు బోధింపవలెనని మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించిన ధర్మమంతయు అనగా కట్టడలు విధులు ఇవే … నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను (ద్వితీ. 6:1-5).

ఇక్కడ వాస్తవిక నేపథ్యములో, దేవుని ప్రేమించుటను గూర్చి యేసు ఉల్లేఖించిన వాక్యభాగము విడదీయజాలని విధముగా మోషే ద్వారా దేవుడు అనుగ్రహించిన ధర్మశాస్త్ర ఆజ్ఞలన్నిటితో ముడిపడియున్నదని మనము చూస్తాము. దేవుని యెడల ప్రేమ ఇతర అవసరతలను ఏనాడు భర్తీ చేయుటకు ఉద్దేశించబడలేదు. కాబట్టి, క్రైస్తవ నీతిశాస్త్రములో ధర్మశాస్త్రమును ఎలా ఉపయోగించాలో అర్థము చేసుకొనుటకు మనము ప్రయత్నించుచుండగా, మనము ప్రేమ యొక్క ప్రాధాన్యతను మరియు ప్రాముఖ్యతను మనస్సులో ఉంచుకోవాలి. వాస్తవానికి, దేవుని ధర్మశాస్త్రమంతా దేవుని మరియు పొరుగువానిని ప్రేమించుట అను ఆజ్ఞలలో క్రోడీకరించబడినది అని మనము జ్ఞాపకముంచుకోవాలి. అయితే అదే సమయములో, ప్రేమ ఆజ్ఞ మీద లేఖనము యొక్క ఉద్ఘాటన బైబిలులోని ఇతర ఆజ్ఞలన్నిటిని పాటించుట నుండి మనకు ఉపశమనమును కలిగించదు అని గుర్తించవలసిన అవసరము ఉన్నది.

ప్రేమ ఆజ్ఞ మరియు మిగిలిన ధర్మశాస్త్రము మధ్య ఉన్న పరస్పరఆధారతను ఇప్పటి వరకు మనము పరీక్షించాము కాబట్టి, ఇప్పుడు కృపా సువార్త దేవుని ధర్మశాస్త్రముతో అనుబంధము కలిగియున్న విధానమును విశదీకరిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## కృపా సువార్త

ధర్మశాస్త్రము కృపా సువార్తకు వ్యతిరేకముగా ఉన్నదని అనేకమంది క్రైస్తవులు సామాన్యముగా అపార్థము చేసుకుంటారు. ధర్మశాస్త్ర కార్యములతో నిమిత్తము లేకుండా మనము కృప ద్వారా రక్షింపబడితిమి కాబట్టి, ధర్మశాస్త్రమునకు విధేయత చూపు బాధ్యత మనకు అసలు లేదు అని అనేకమంది నమ్ముతారు. ధర్మశాస్త్రమును పాపులకు భయముగాను భీతిగాను మాత్రమే చూడాలని, అయితే దీనికి భిన్నముగా సువార్త ధర్మశాస్త్రము మనలను ఖండించిన తరువాత మనలను రక్షిస్తుంది అని ఇతరులు నమ్ముతారు. వాస్తవానికి, ధర్మశాస్త్రము మరియు కృపా సువార్త మధ్య ఉన్న అనుబంధమును గూర్చి మనము ప్రస్తావించుటకు అవకాశములేని అనేక అభిప్రాయములు ఉన్నాయి. కాబట్టి, అనేక అబద్ధ ఆలోచనలను ఎదురించుటకు, సాంప్రదాయికముగా "ధర్మశాస్తము యొక్క మూడు ఉపయోగములు" అని పిలువబడుదాని మీద దృష్టిపెట్టుట ద్వారా ఈ అనుబంధము మీద బైబిలు దృష్టికోణమును మనము వర్ణిద్దాము.

ప్రొటెస్టెంట్ సంస్కరణ నాటి నుండి, లేఖనములో ధర్మశాస్త్రము యొక్క ఉపయోగమును గూర్చి వేదాంతవేత్తలు మూడు విభిన్నమైన మార్గములలో మాట్లాడారు. అనేక విభిన్నమైన ఉపయోగముల యొక్క మాన్యతను గూర్చి ఎంతో సమ్మతి ఉన్నను, ఈ ఉపయోగములను తెలుపు విషయములో వేదాంతవేత్తలు ఎల్లప్పుడూ స్థిరత్వమును చూపలేదు. కాబట్టి, సందిగ్ధతను నివారించుటకు, ఈ పాఠములలో ధర్మశాస్త్రము యొక్క మూడు ఉపయోగములను సంబోధించి మాట్లాడదాము:

ధర్మశాస్త్రము యొక్క మొదటి ఉపయోగము బోధించు ఉపయోగము, లేక ధర్మశాస్త్రమును బోధకునిగా ఉపయోగించుట అయ్యున్నది. బోధించుటకు ఉపయోగించినప్పుడు, ప్రజల యొక్క పాపమును బట్టబయలు చేయుట ద్వారా, మరియు దానికి కలుగు శిక్షను గూర్చి హెచ్చరించుట ద్వారా ధర్మశాస్త్రము వారిని క్రీస్తు వైపుకు నడిపిస్తుంది.

ధర్మశాస్త్రము యొక్క రెండవ ఉపయోగము పౌర ఉపయోగమైయున్నది. పౌర అవసరతల కొరకు ధర్మశాస్త్రమును మనము ఉపయోగించినప్పుడు, సమాజములో పాపమును అదుపు చేయుటకు దానిని మనము ఉపయోగిస్తాము. ఈ ఉపయోగము కొన్నిసార్లు బాహ్య క్రమశిక్షణకు సంబంధించినదైయుంటుంది.

ధర్మశాస్త్రము యొక్క మూడవ ఉపయోగము నిర్ణాయక ఉపయోగమైయున్నది. ఇది ధర్మశాస్త్రమును నమ్మకమైన క్రైస్తవుల కొరకు మార్గదర్శిగా లేక నియమముగా ఉపయోగించుట అయ్యున్నది.

ధర్మశాస్త్రము యొక్క బోధించు లేక మొదటి ఉపయోగము, దేవుని ధర్మశాస్త్రము అవిశ్వాసుల పాపమును బట్టబయలు చేసి, క్రీస్తు యొక్క అవసరతను వారికి చూపు విధానమును గూర్చి మాట్లాడుతుంది. ఒక విషయము నిషేధించబడినప్పుడు దానిని చేయుటకు మనము ఎక్కువగా ఆకర్షించబడతాము అను అనుభవమును మనమంతా కలిగియుంటాము. రోమా. 7:7-8లో ధర్మశాస్త్రము

యొక్క బోధించు ఉపయోగముతో తన వ్యక్తిగత అనుభవమును పౌలు తెలియపరుస్తూ, ఈ మాటలను వ్రాశాడు:

> ఆశింపవద్దని ధర్మశాస్త్రము చెప్పనియెడల దురాశయన ఎట్టిదో నాకు తెలియకపోవును. అయితే పాపము ఆజ్ఞను హేతువు చేసికొని సకలవిధమైన దురాశలను నాయందు పుట్టించెను. ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము మృతము (రోమా. *7:7-8*).

ధర్మశాస్త్రము యొక్క ఈ ఉపయోగము సాధారణంగా విశ్వాసులు ఒకప్పుడు ధర్మశాస్త్రము క్రింద ఉన్నారుగాని, ఇప్పుడు కృప ఆధీనములో ఉన్నారు అను బైబిలు బోధనతో ముడిపడియున్నది. ధర్మశాస్త్రము యొక్క ప్రామాణికతలు మరియు నిషేదములను అవిశ్వాసులు ఎదుర్కొనినప్పుడు, వారు మరి ఎక్కువగా పాపము చేయుటకు పురికొల్పబడతారు, మరియు వారి పాపము వలన ధర్మశాస్త్రము వారికి హెచ్చరించు శిక్ష లేక శాపమును వారు గుర్తిస్తారు. ఈ హెచ్చరిక కొందరిని క్రీస్తు వైపుకు లాగుతుంది, మరియు ఆయన వారిని ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి కృపతో రక్షిస్తాడు. రోమా. 6:14లోని పౌలు మాటల వెనుక ఇదే ఆలోచన ఉన్నది:

> మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు (రోమా. 6:14).

ఈ భావనలో, ధర్మశాస్త్రము యొక్క బోధనా ఉపయోగము విశ్వాసులకు సూటిగా అనువర్తించబడదు. ఒక వ్యక్తి ఒకసారి క్రీస్తు వైపుకు ఆకర్షించబడిన తరువాత, ఈ విషయములో ధర్మశాస్త్రము దాని పనిని ముగించింది. కాబట్టి, బోధనా ఉపయోగము విషయానికొస్తే, మనమిక ధర్మశాస్త్రము యొక్క ఆధీనములో లేము.

ధర్మశాస్త్రము యొక్క పౌర లేక రెండవ ఉపయోగములో దానిని ఉల్లంఘించువారికి శిక్షను ప్రకటించుట ద్వారా ధర్మశాస్త్రము పాపమును అదుపుచేస్తుంది. మనపై పౌర అధికారము కలిగియున్నవారు మనకు శిక్షను విధిస్తారు అను భయముతో మనము మన ప్రవర్తనను అదుపు చేసుకొను విధానములను గూర్చి ఆలోచించవచ్చు. ఈ ధర్మశాస్త్ర ఉపయోగము విశ్వాసులకు మరియు అవిశ్వాసులకు ఒకే విధముగా వర్తిస్తుంది, మరియు చెడుతనమును అదుపుచేయుటకు సాధనముగా పౌర ప్రభుత్వము కొరకు దేవుడు కలిగియున్న స్థానము మీద ఇది విశేషముగా దృష్టిపెడుతుంది. భవిష్యత్ పాఠములలో, ధర్మశాస్త్రము యొక్క ఈ ఉపయోగమును గూర్చి మనము అనేక అంశములను చూద్దాము, కాబట్టి ప్రస్తుతానికి దీనిని ఊరకనే ప్రస్తావించి, ఇది కృపా సువార్తతో పొంతన లేకుండా లేదు అని గుర్తిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అయితే ధర్మశాస్త్రము యొక్క మూడవ లేక నిర్ణాయక ఉపయోగము, ధర్మశాస్త్రమును గూర్చి సువార్త మరియు క్రైస్తవ నీతిశాస్త్రము దృష్ట్యా ఆలోచించినప్పుడు ఎంతో సహాయకరముగా ఉంటుంది. నిర్ణాయక ఉపయోగము ధర్మశాస్త్రమును ఈ పాఠములలో ఉపయోగించు విధముగా, అనగా క్రైస్తవ జీవనము కొరకు దేవుని చిత్తము యొక్క ప్రత్యక్షతగా అనువర్తిస్తుంది. దీనిని మనము మనలను సురక్షితముగా ఉంచుటకు మన తల్లిదండ్రులు నియమించిన గృహ నియమములకు పోల్చవచ్చు మరియు మనము మన తల్లిదండ్రులను ప్రేమించాము మరియు నమ్మాము కాబట్టి వారికి విధేయత చూపాము. ఒక ఉదాహరణగా, 1 యోహాను 3:4లోని మాటలు గమనించండి:

> పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4).

క్రీస్తు పరలోకమునకు ఆరోహణమైన చాలా కాలము తరువాత యోహాను ఈ మాటలను వ్రాశాడు. ఏదిఏమైనా, ధర్మశాస్త్రము మన ప్రవర్తన కొరకు ప్రామాణికతగా ఉన్నదని అతడు ఉద్ఘాటించాడు. పాపమంతటిని ధర్మశాస్త్రమును ఉల్లంఘించుటగా నిర్వచించునంత దూరము అతడు వెళ్లాడు. సులువుగా చెబితే, క్రైస్తవ ప్రవర్తన నీతిగా ఉన్నదో లేక పాపభరితముగా ఉన్నదో నిర్ధారించుటకు ధర్మశాస్త్రము ఇప్పటికీ ప్రామాణికతగా ఉన్నది. మరియు ధర్మశాస్త్రము క్రైస్తవ ప్రవర్తన కొరకు ప్రామాణికతగా ఉపయోగించబడినప్పుడు, అది సువార్తతో సంపూర్ణ అనుగుణ్యతలో ఉంటుంది అని అనేక వాక్యభాగములు సూచించాయి.

రక్షింపబడుటకు ముందు, మనమంతా పాపులమైయుండి, ధర్మశాస్త్రమును పాటించుటలో అసమర్థులమైయుంటిమి. మనము ధర్మశాస్త్రమును ఉల్లంఘించువారము కాబట్టి ధర్మశాస్త్రము యొక్క శాపము క్రింద ఉంటిమి. అయితే ఇప్పుడు మనము రక్షింపబడితిమి కాబట్టి, మనము క్రీస్తునందు పరిపూర్ణముగా ధర్మశాస్త్రమును పాటించువారిగా పరిగణించబడ్డాము, కాబట్టి ధర్మశాస్త్రము వాగ్దానము చేసిన రక్షణ మరియు జీవితము అను ఆశీర్వాదములను మనము పొందుకుంటాము. ఈ స్థితిని పౌలు ధర్మశాస్త్రము అను శాపము క్రింద ఉండుటకు వ్యతిరేకముగా "కృపలో" ఉండుటగా వర్ణించాడు.

క్లుప్తంగా, మనము పాపము చేసినప్పుడు శ్రమను అనుభవిస్తాము అను విధముగా విశ్వాసులమైన మనము "ధర్మశాస్త్రము యొక్క ఆధీనములో" లేముగాని, దాని ఆశీర్వాదములను పొందుకొను భావనలో, మరియు దానిని పాటించుటకు బద్ధులమైయున్న భావనలో "ధర్మశాస్త్రము యొక్క ఆధీనములో" ఉన్నాము. యాకోబు 1:25లో, యాకోబు ఈ సంగతిని ఈ విధముగా తెలియజేయుచున్నాడు:

> వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా. అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా

ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడగును (యాకోబు 1:25).

దేవుని ధర్మశాస్త్రము ప్రేమ ఆజ్ఞకు మరియు కృపా సువార్తకు మద్దతునిచ్చు విధానమును ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు క్రొత్త నిబంధన మరియు విమోచన చరిత్రలోని పురోగమనములతో అనుబంధములో మనము ధర్మశాస్త్రమును చూడవలెను.

## నూతన నిబంధన

విమోచన చరిత్ర మరియు క్రొత్త నిబంధనను గూర్చి మనము మాట్లాడునప్పుడు, యేసు క్రీస్తు చేసిన కార్యము వలన పాత మరియు క్రొత్త నిబంధన యుగముల మధ్య చోటుచేసుకున్న మార్పులను మనము సూచించుచున్నాము. మరియు ఈ సమయమందు, క్రైస్తవ నీతిశాస్త్రములో మనము ధర్మశాస్త్రమును ఉపయోగించుటను ఈ మార్పులు ప్రభావితము చేయు విధానముపై ఎక్కువ ఆసక్తి కలిగియున్నాము. పాత నిబంధనలో, క్రొత్త నిబంధన అను పదము పేరు పెట్టి యిర్మీయా 31:31లో ఒక్కసారి మాత్రమే ప్రస్తావించబడినది. మరొక వైపున, క్రొత్త నిబంధన దీనిని అనేకసార్లు ప్రస్తావిస్తుంది. అయితే, మన ఉద్దేశముల కొరకు అత్యంత ఉపయోగకరమైన సందర్భమును హెబ్రీ. 8లో చూడవచ్చు, అక్కడ రచయిత యిర్మీయా 31ని స్పష్టముగా ఉల్లేఖిస్తూ దానిని సంఘమునకు అనువర్తించాడు. హెబ్రీ. 8:8-10లో మనము ఈ మాటలను చదువుతాము:

> ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారి తోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ... వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు జనులగుదురు (హెబ్రీ. 8:8-10).

క్రొత్త నిబంధన మనలను ధర్మశాస్త్రము నుండి స్వతంత్రులనుగా చేయునది కాదు అని ఈ వాక్యభాగములో గమనించండి. బదులుగా, క్రొత్త నిబంధనలో కూడా ధర్మశాస్త్రము కేంద్రమైయున్నది. వాస్తవానికి, క్రొత్త నిబంధన నియమములుగా ధర్మశాస్త్రము మన మనస్సుల మీద మరియు హృదయముల మీద వ్రాయబడియున్నది.

మన హృదయములు మరియు మనస్సుల మీద ధర్మశాస్త్రము వ్రాయబడియుండు చిత్రము మనము ధర్మశాస్త్రమును యెరిగియున్నాము మరియు ప్రేమించుచున్నాము అని సూచిస్తుంది. మునుపటి కాలమునకు చెందినదిగా ధర్మశాస్త్రమును విడిచిపెట్టుట కాదుకదా, క్రొత్త నిబంధనలో మనము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ధర్మశాస్త్రమును అంతరంగికము చేసి, దానిని నిజాయితీగా అనుసరిస్తాము. వాస్తవానికి, పాత నిబంధనలో కూడా ధర్మశాస్త్రమును ఈ విధముగానే ఆచరించవలసియుండినది. మరియు దేవుడు ద్వితీ. 6:6లో ఇలా సెలవిచ్చాడు:

> నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను (ద్వితీ. 6:6).

మరియు కీర్తనలు 119:11లో కీర్తనకారుడు సాక్ష్యమిచ్చినట్లు:

> నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను.

దేవుని వాక్యము ఎల్లప్పుడూ ఆయన ప్రజల యొక్క హృదయములు మరియు మనస్సులలో ఉండవలసియున్నది, మరియు వాస్తవానికి పాత నిబంధనలో కూడా అనేకమంది హృదయములు మరియు మనస్సులలో అది ఉండినది. మన హృదయములు మరియు మనస్సుల మీద ధర్మశాస్త్రము వ్రాయబడుట క్రొత్త నిబంధనలో క్రొత్తగా లేక భిన్నముగా ఏమి జరుగలేదు; ఇది పాత నిబంధన యొక్క కొనసాగింపు అయ్యున్నది.

ధర్మశాస్త్రమును పాటించుటకు క్రొత్త నిబంధన మనకు మరిప్రాముఖ్యమైన కారణములను ఇస్తుంది అని మనము చెప్పవచ్చు. ఎందుకంటే, పాత నిబంధనలో విశ్వాసులు ధర్మశాస్త్రమునకు విధేయత చూపుటకు ఆధారముగా ఐగుప్తు నుండి నిర్గమన వైపుకు వెనుకకు మరియు వాగ్దాన దేశములో జీవితము వైపుకు ముందుకు చూశారు. అయితే నేడు క్రైస్తవులు ధర్మశాస్త్రమునకు విధేయత చూపుటకు ఆధారముగా క్రీస్తునందు రక్షణ అను గొప్ప కార్యము వైపుకు వెనుకకు చూస్తారు మరియు ఆయన రెండవ రాకడ అను క్రీస్తు యొక్క గొప్ప కార్యము కొరకు ఎదురుచూస్తారు.

అయితే మరొకసారి, క్రైస్తవులముగా పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య చోటు చేసుకున్న మార్పుల వెలుగులో మనము ధర్మశాస్త్రమును పునః అనువర్తించుట చాలా ప్రాముఖ్యమైయున్నది. హెబ్రీ పత్రిక రచయిత, హెబ్రీ 10:1లో ఈ క్రింది విధంగా చెప్పుతున్నాడు:

> ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలదికాదు (హెబ్రీ. 10:1).

క్రొత్త నిబంధనలో, ధర్మశాస్త్రము ముందుగానే గుర్తించిన వ్యక్తిగా యేసు బయలుపరచబడ్డాడు. ఫలితంగా, పాత నిబంధన విశ్వాసులను జంతు బలులు అర్పించ బద్ధులనుగా చేసిన అనేక ఆజ్ఞలు, అవి సూచికముగా ఉన్న వాస్తవికత, అనగా క్రీస్తు యొక్క బలిలో ఇప్పుడు నెరవేర్చబడినవి. ఫలితంగా, ఎడ్లు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు మేకలను అర్పించుట ద్వారాగాక, మన బలిగా యేసుపై ఆధారపడుట ద్వారా మనము ఈ ఆజ్ఞలను సరియైన రీతిలో పాటిస్తాము.

భవిష్యత్ పాఠములలో, ధర్మశాస్త్రమును క్రొత్త నిబంధన యుగమునకు అనువర్తించుచుండగా మనము చేయవలసిన కొన్ని సర్దుబాట్లను దగ్గరగా పరిశీలన చేద్దాము. అయితే ప్రస్తుతానికి, క్రొత్త నిబంధన యుగములో కూడా నియమ రూపములో ధర్మశాస్త్రము అనువర్తించబడాలి అను దృశ్యము స్పష్టమైయుండాలి.

ప్రేమ, సువార్త, మరియు క్రొత్త నిబంధనతో అనుబంధములో మనము ధర్మశాస్త్రమును విశదీకరించాము కాబట్టి, ఇప్పుడు మన చివరి అంశమును చూచుటకు సిద్ధముగా ఉన్నాము: దేవుని ఆజ్ఞలన్నీ ఒకదానితో ఒకటి కలిగియున్న సామరస్యం.

## సామరస్యం

బైబిలు యొక్క న్యాయ వ్యవస్థలో, అనేక ఆజ్ఞలు మరియు అవసరతలు ఉన్నాయి. ఇవి ఎంత ఎక్కువగా ఉండి ఎన్ని విషయములను గూర్చి మాట్లాడతాయి అంటే, ఈ ఆజ్ఞలు కొన్నిసార్లు విభేదించుచున్నట్లు అనిపిస్తుంది. నియమముల మధ్య సంఘర్షణ అను సమస్యను నియమముల-పై దృష్టి పెట్టు లేక డియోంటలాజికల్ నీతిశాస్త్ర వ్యవస్థలన్నీ ఎదుర్కుంటాయి. కాని బైబిలు ధర్మశాస్త్రము విషయములో మాత్రం, నిజమైన వ్యత్యాసములు పెద్దగా కనిపించవు; దేవుని గుణము ఏనాడు దానితో అది సంఘర్షించని విధముగానే, దేవుని ఆజ్ఞలు ఏనాడు ఒకదానితో ఒకటి సంఘర్షించవు. బదులుగా, లేఖనములోని నైతిక బోధనలు అన్నీ పరిపూర్ణ సామరస్యము కలిగియున్నాయి.

యాకోబు 2:10లో మనము చూసినట్లు, ధర్మశాస్త్రము ఒక ఐక్య సంగ్రహమైయున్నది:

> ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞవిషయములో తప్పి పోయినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును (యాకోబు 2:10).

ధర్మశాస్త్రము ఐక్యత కలిగియున్నది కాబట్టి, దానిలోని పలు ఆజ్ఞలు కలిసి మన విధేయతను కోరతాయి. అనగా, మన క్రియలు ధర్మశాస్త్రములోని ఒక నియమముతో నిజమైన సమ్మతిని కలిగియున్నప్పుడు, అవి సంపూర్ణ ధర్మశాస్త్రముతో సమ్మతి కలిగియుంటాయి.

కాబట్టి, లేఖనములోని పలు ఆజ్ఞలు ఒకదానితో ఒకటి విభేదించుచున్నట్లు కనిపించినప్పుడు, మనము ధర్మశాస్త్రమును సరిగా గ్రహించలేదు అని దాని అర్థమైయున్నది. వాస్తవమేమిటంటే, మనము ఏనాడు ధర్మశాస్త్రమంతటిని పరిపూర్ణముగా అర్థము చేసుకోలేము, కాబట్టి మధ్య మధ్యలో మనము దేవుని యొక్క పలు ఆజ్ఞల మధ్య చీల్చబడినట్లు భావిస్తాము. అయితే ఆచరణాత్మకముగా ఈ ఉద్రిక్తతలను మనము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఏవిధంగా పరిష్కరించగలము? సరే, ఇట్టి పరిస్థితులను గూర్చి అనేక విషయములను చెప్పవచ్చు, కాని మనము రెంటిని మాత్రమే ప్రస్తావిద్దాము.

మొదటిగా, కొన్నిసార్లు కొన్ని ఆజ్ఞలు ఇతర ఆజ్ఞల కంటే ఎక్కువ ప్రాధాన్యతను తీసుకుంటాయి అను ఆలోచనతో దేవుని ఆజ్ఞలు ఇవ్వబడినవి. ఉదాహరణకు, మత్తయి 5:23-24లో, యేసు ఈ క్రింది హెచ్చరికను ఇచ్చాడు:

> కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైననుకలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము (మత్తయి 5:23-24).

దేవునికి అర్పించిన కొన్ని బలుల విషయములో కూడా దేవుని ప్రజల మధ్య సమాధానము ప్రాధాన్యతను కలిగియుంటుంది అని యేసు బోధించాడు — ఎంతమట్టుకు అంటే ఒక విశ్వాసి బలిపీఠము యొద్ద బలిని అర్పించుటకు సిద్ధముగా ఉన్నప్పటికీ, తన అర్పణను ఆపి, వెళ్లి తన సహోదరునితో సమాధానపడవలసియున్నది.

కొన్ని పాపములు మిగిలిన పాపముల కంటే ఘోరమైనవి అని చెప్పిన ప్రతిసారి, లేక కొన్ని ఆజ్ఞలు ఇతర ఆజ్ఞల కంటే ఎక్కువ ప్రాముఖ్యమైనవి అని చెప్పిన ప్రతిసారి, బైబిలు దానిలోని విభిన్నమైన ఆజ్ఞలకు విభిన్నమైన స్థాయిలలో ప్రాధాన్యతను ఆపాదిస్తుంది అని మనము గ్రహించాలి. కాబట్టి, ఒక ఆజ్ఞకు మరొక ఆజ్ఞ కంటే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చుట ధర్మశాస్త్రమంతటికి అనుగుణంగా ఉన్నది, కాబట్టి అది ఆజ్ఞల మధ్య సంఘర్షణగా పరిగణించబడకూడదు.

రెండవదిగా, నియమములకు మినహాయింపులు ఉన్నాయి అను అంతర్గత అవగాహనతో కూడా బైబిలు ఆజ్ఞలు ఇవ్వబడినవి. అనగా, బైబిలు యొక్క న్యాయ వ్యవస్థలో, ఆపత్కాల సమయములలో మరియు ఇతర అసాధారణ పరిస్థితులలో, సాధారణ నిబంధనలు ప్రాముఖ్యమైన నియమములను అధిగమిస్తాయి అని అనవచ్చు.

ఉదాహరణకు, అపొ. 5లో అపొస్తలులు మరియు సమాజ మందిరపు పెద్దల మధ్య జరిగిన సంఘర్షణను చూడండి. ఆ సందర్భములో, సమాజ మందిరపు పెద్దలు యేసును గూర్చి ప్రకటించుట మానమని అపొస్తలులకు ఆజ్ఞాపించారు, కాని అపొస్తలులు వారి ఆజ్ఞను తిరస్కరించారు. వారి క్రియలకు అపొస్తలులు ఇచ్చిన సమర్థన అపొ. 5:29లో నమోదు చేయబడింది:

> మనుష్యులకు కాదు దేవునికే మేము లోబడవలెను గదా (అపొ 5:29).

ఈ సందర్భములో, యూదుల సమాజ నిర్వహణ గుంపుగా, సమాజ మందిరపు పెద్దలకు అపొస్తలులపై కొంత అర్థమైన అధికారము ఉన్నది. మరియు సాధారణ నియమముగా, మనము మానవ అధికారములకు విధేయత చూపాలని బైబిలు కోరుతుంది. అయితే, సమాజ మందిరపు పెద్దలు దేవుని ఆజ్ఞలను వ్యతిరేకించినప్పుడు, మన మానవ నాయకులకు మనము విధేయత చూపాలను సాధారణ నియమమును ఇది మినహాయించింది. ఈ మినహాయింపు కారణంగా, సమాజ మందిరపు పెద్దలకు అవిధేయత చూపి, దేవునికి విధేయత చూపుట అపొస్తలులు చేయదగిన నీతిగల, మంచి పని అయ్యుండినది.

కాని మరొకసారి, ఇది ఒక ఆజ్ఞ మరొక ఆజ్ఞను వ్యతిరేకించిన సందర్భము మాత్రం కాదు. ఎందుకంటే, ధర్మశాస్త్రము దేవుని గుణమును బయలుపరచు ఐక్య సంపూర్ణత అయ్యున్నది, మరియు దేవుని గుణము దానితో అది పోరాడదు. బదులుగా, సామాన్య నియమములు కొన్నిసార్లు భిన్నమైన కార్యములను చేయవలసియుంటుంది అని ధర్మశాస్త్రము ఆశిస్తుంది. ఈ సందర్భములలో, ప్రతి ఆజ్ఞ మరియు నియమమును చూచుట ద్వారా, మరియు ప్రతి బాధ్యత వెలుగులో పరిస్థితిని మరియు హేతువులను కొలచుట ద్వారా చేయవలసిన సరియైన పనిని కనుగొనాలి. మనము కొన్ని నియమములను అనువర్తించు విధానమును అది పోలియుండకపోయినప్పటికీ, ధర్మశాస్త్రము యొక్క సమస్తమునకు దాని యొక్క సంపూర్ణ అర్థములో విధేయత చూపుట ఉత్తమమైన పని అయ్యున్నది.

అవును, లేఖనములోని అనేక ఆజ్ఞలకు ప్రాధాన్యతలను ఆపాదించునప్పుడు మనము కొంత జాగ్రత్త వహించాలి. మరియు మనము పరిమితమైన, పతనమైన మానవులము కాబట్టి, మనము కొన్నిసార్లు చేయవలసిన సరియైన పనిని కనుగొనుటలో విఫలమగుట మరియు కొన్నిసార్లు తప్పు నిర్ణయములను తీసుకొనుట నిస్సందేహముగా జరుగుతుంది. అయినప్పటికీ, లేఖనములు ఐక్యత కలిగియున్నాయని, కాబట్టి దేవుని ఆజ్ఞలు ఒకదానితో ఒకటి సామరస్యమును చూపు మార్గములను కనుగొనుటకు మనము ప్రయత్నించాలని ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకోవాలి.

## ముగింపు

ఈ పాఠములో, క్రైస్తవ నీతిశాస్త్రము కొరకు దేవుని ప్రామాణికతలుగా లేఖనములోని అనేక భాగములు మరియు అంశములు పని చేయు విధానములను మనము చూశాము. లేఖనములోని విభిన్నమైన భాషలు మరియు సాహిత్యములను కొంత వరకు విభిన్నమైన రీతులతో ఉపయోగించాలని మరియు ప్రతి ఒక్కటి నీతిశాస్త్రమును గూర్చి మనకు ఎంతో కొంత విశేషమైన విషయములను తెలియజేస్తుంది అని మనము చూశాము. లేఖనములో దేవుని ధర్మశాస్త్రము యొక్క విభాగములు మరియు కార్యములను కూడా మనము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విశదీకరించాము. మరియు ధర్మశాస్త్రము దానితో అది మరియు లేఖనములోని ఇతర భాగములతో ఐక్యపరచబడిన విధానమును కూడా మనము చూశాము.

బైబిలు నీతిశాస్త్రమును గూర్చిన మన అధ్యయనమును మనము కొనసాగించుచుండగా, లేఖనములో అనేక విభిన్నమైన భాగములు మరియు అంశములు ఉన్నాయని మరియు ప్రతి ఒక్కటి విభిన్నమైన మార్గములలో నైతిక సమాచారమును మనకు తెలియజేస్తుంది అని జ్ఞాపకముంచుకొనుట చాలా ప్రాముఖ్యమైయున్నది. మనము అధ్యయనము చేయుటను మరియు దేవుని ఎదుట మన జీవితములను జీవించుటను కొనసాగించుచుండగా ఈ ఆలోచనలను మనస్సులో పెట్టుకొనుట ద్వారా, లేఖనములోని ప్రతి భాగము మరియు అంశమును మనము బాధ్యతాయుతముగా ఉపయోగించగలుగుతాము మరియు దేవుడు మనకు బయలుపరచిన ప్రామాణికతలకు దగ్గరగా మన జీవితములను జీవించగలుగుతాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.